# ప్రజాపాలన

సంపుటి 12 సంచిక 115 విశాఖపట్నం | శనివారం 9 జనవరి 2021 | 8 పేజీలు | వెల : 5.00



చదవండి... చదివించండి... చందాదారులుగా చేరండి...
జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాపాలన
న్యూస్ ఈజ్ రైట్
6-2-29/3/12, 3వ అంతస్థు,
దౌలత్ ప్లాజా, లక్డీకాపూల్, హైదరాబాద్ - 004
వివరాలకు సంప్రదించండి : 8886022523


# 11న ముఖ్యమంత్రులతో ప్రధాని మోదీ భేటీ



**న్యూఢిల్లీ, జనవరి 8 (ప్రజా పాలన) :** కరోనా వ్యాక్సిన్ పంపిణీ నేపథ్యంలో ఈ నెల 11న సోమవారం ప్రధాని నరేంద్ర మోదీ అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులతో భేటీకానున్నారు. వీడియోకాన్ఫరెన్స్ ద్వారా సాయంత్రం 4 గంటలకు సమావేశం జరుగుతుందని అధికార వర్గాలు తెలిపాయి. ఇప్పటికే కరోనా వ్యాక్సిన్ పంపిణీపై కేంద్ర ప్రభుత్వం ఏర్పాట్లను పూర్తి చేసింది. టీకా పంపిణీ, కోల్డ్ స్టోరేజీల ఏర్పాటు వంటి ప్రధాన అంశాలపై ప్రధాని మోదీ చర్చించనున్నట్లు సమాచారం. ఇప్పటికే డ్రగ్ కంట్రోలర్ జనరల్ ఆఫ్ ఇండియా సీరం ఇనిస్టిట్యూట్ కొవిషీల్డ్, భారత్ బయోటెక్ కొవాగ్జిన్ వ్యాక్సిన్లకు దేశంలో అత్యవసర వినియోగానికి అనుమతి ఇచ్చిన విషయం తెలిసిందే. టీకా పంపిణీకి సంబంధించి శుక్రవారం కేంద్రం మరోసారి దేశవ్యాప్తంగా డ్రై రన్ నిర్వహించింది. తొలి దశలో 30 కోట్ల మంది ఫ్రంట్‌లైన్ వారి యర్స్, ఆరోగ్య కార్యకర్తలు, వృద్ధులకు ఇవ్వాలని యోచిస్తోంది. ఇదిలా ఉండగా.. జనవరి 13 నుంచి దేశవ్యాప్తంగా కరోనా వ్యాక్సినేషన్ ప్రక్రియను ప్రారంభించేందుకు కేంద్ర ఆరోగ్యశాఖ ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేసింది. ఇప్పటికే దేశంలో కర్నాల్, ముంబై, చెన్నై, కోల్‌కతా నగరాల్లోని 37 స్టోరేజ్ సెంటర్లలో వ్యాక్సిన్ నిల్వలకు సంబంధించిన ఏర్పాట్లను కేంద్రం పూర్తి చేసింది.

# రాష్ట్రంలో ఫస్ట్ ఇంటర్ తరగతుల ప్రారంభం



- రాష్ట్ర విద్యా శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్
- ఆఫ్ లైన్లోనే ఇంటర్ అడ్మిషన్లు
- త్వరలో ఇంటర్ పరీక్షల షెడ్యూల్
- ఈ నెల 11న సీఎం జగన్ చేతుల మీదుగా జగనన్న అమ్మఒడి రెండో విడత చెల్లింపులు.

**అమరావతి, జనవరి 8 ప్రజా పాలన :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కోర్టు ఉత్తర్వుల మేరకు ఈ ఏడాది ఆఫ్ లైన్లోనే ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం అడ్మిషన్ల ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర విద్యా శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ తెలిపారు. ఈ నెల 18వ తేదీ నుంచి మొదటి ఇంటర్ తరగతులు ప్రారంభం కానున్నాయన్నారు. వచ్చే ఏడాది నుంచి ఆన్ లైన్లో అడ్మిషన్లు నిర్వహించనున్నామన్నారు. త్వరలో ఇంటర్మీడియట్ పరీక్షలకు సంబంధించిన షెడ్యూల్ విడుదల చేస్తామన్నారు. ఈ నెల 11 తేదీన జగనన్న అమ్మఒడి రెండో విడత చెల్లింపులు సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి చేతుల మీదుగా ఆన్ లైన్ ద్వారా విడుదల చేయనున్నామని మంత్రి తెలిపారు. సచివాలయంలోని నాలుగో బ్లాక్ పబ్లిసిటీ సెల్ లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కోర్టు ఉత్తర్వుల మేరకు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం అడ్మిషన్లు ఆఫ్ లైన్లో నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. దీనికి సంబంధించిన షెడ్యూల్ ఇప్పటికే విడుదల చేశామన్నారు. ఈ నెల 7వ తేదీ నుంచే అడ్మిషన్ దరఖాస్తులు విక్రయాలు ప్రారంభమయ్యాయన్నారు. ఈ నెల 17 వ తేదీ... దరఖాస్తుల స్వీకరణకు ఆఖరి గడువని, అదే రోజు అడ్మిషన్లు కూడా పూర్తవుతాయని మంత్రి తెలిపారు. ఆ మరుసటి రోజు అనగా ఈ నెల 18వ తేదీ నుంచి ఇంటర్ మొదటి సంవత్సరం తరగతులు ప్రారంభమవుతాయని మంత్రి వెల్లడించారు.

**త్వరలో ఇంటర్ పరీక్షల షెడ్యూల్**

2020-21 విద్యా సంవత్సరం ఈ ఏడాది మే వరకూ కొనసాగుతుందని మంత్రి ఆదిమూలపు సురేష్ వెల్లడించారు. సీబీఎస్ఈ షెడ్యూల్ ప్రకారం మిగతా 2లో..

# 9 ఆలయాల పునర్నిర్మాణానికి సీఎం జగన్ భూమి పూజ





**విజయవాడ, జనవరి 8 (ప్రజా పాలన) :** గత ప్రభుత్వ హయాంలో విజయవాడలో కూల్చి వేసిన 9 గుడులను పునఃనిర్మించే పనులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి శుక్రవారం భూమి పూజ నిర్వహించారు. ఉదయం 11.01కి కృష్ణా నది ఒడ్డున సీతమ్మ పాదాల వద్ద ఆలయాల పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం అక్కడ నుంచి నేరుగా ఇంద్రకీలాద్రికి చేరుకొని అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. అనంతరం కనకదుర్గమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. తదుపరి వేద పండితులు ఘనాపాటీలు ఆంజనేయ శర్మ , వివిఎల్ఎన్ ఘనాపాటి, వెంకటేశ్వర రావు, రామకృష్ణ ఆశీర్వచనాలు అందచేశారు. అనంతరం దేవాదాయ శాఖ రాష్ట్రంలోని వివిధ ఆలయాలపై రూపొందించిన క్యాలండర్‌ను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు వెల్లంపల్లి శ్రీనివాసరావు , బొత్స సత్యనారాయణ, పేర్ని నాని, కొడాలి నాని, సీఎం కార్యక్రమాల సమన్వయ కర్త తలశిల రఘురాం, బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ మల్లాది విష్ణు, ఎమ్మెల్యేలు పార్ధసారధి, జోగి రమేష్, మిగతా 2లో..

# విగ్రహాల ధ్వంసం కేసు సిఐడి నుంచి సిట్‌కు బదిలీ..

**అమరావతి, జనవరి 8 ప్రజాపాలన :** ఏపిలో దేవాలయాలు, విగ్రహాల ధ్వంసం కేసుపై రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కేసు విచారణ సిట్‌కు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దేవుళ్ల విగ్రహాల ధ్వంసానికి సంబం ధించి ఏపిలో తీవ్ర దుమారం చెలరేగుతోన్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ప్రభుత్వం కేసు విచారణను సిఐడికి అప్పగించింది. రాష్ట్రంలో ప్రార్థనా మందిరాలు, దేవాలయాలపై పదే పదే దాడులు ఒక పథకం ప్రకారం జరుగుతున్నాయని, వీటిపై దర్యాప్తునకు సిట్‌ను నియమించి దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని వాటిని అణచకపోతే రాష్ట్ర భవిష్యత్‌కు నష్టం వాటిల్లుతుందని వామపక్షాలు పేర్కొన్నాయి. దీంతో కేసును సిఐడి నుంచి సిట్‌కు బదిలీ చేస్తూ ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది.

# 'రద్దు'కే రైతన్నలు.. కష్టమన్న కేంద్రం

## కొనసాగుతున్న ప్రతిష్టంభన: 15న మళ్లీ చర్చలు



**న్యూఢిల్లీ, జనవరి 8 (ప్రజాపాలన) :** వ్యవసాయ చట్టాలపై కేంద్రం, రైతుల మధ్య ప్రతిష్టంభన కొనసాగుతూనే ఉంది. చట్టాలను రద్దు చేయాల్సిందేనని అన్నదాతలు పట్టు బట్టగా.. అది మాత్రం కుదరదని కేంద్రం చెబుతోంది. దీంతో ఎనిమిదో విడత చర్చలు కూడా ఫలించలేదు. చట్టాలను ఉపసంహరించుకుంటేనే తాము ఇళ్లకు వెళ్తామని రైతులు ఘంటాపథంగా చెబుతున్నారు. దీంతో తదుపరి దఫా చర్చలను జనవరి 15వ తేదీకి వాయిదా వేశారు. నూతన సాగు చట్టాలను వ్యతిరేకిస్తూ ఉద్యమం చేస్తున్న 41 రైతు సంఘాల ప్రతినిధులతో కేంద్ర మంత్రులు నరేంద్రసింగ్ తోమర్, పీయూష్ గోయల్, మిగతా 2లో..

# ముంబయి దాడి సూత్రధారికి 15 ఏళ్ల జైలుశిక్ష



**లాహోర్, జనవరి8 (ప్రజాపాలన) :** ముంబయి దాడి సూత్రధారి, లష్కరే తొయిబా కార్యకలాపాల కమాండర్ అయిన జాకీర్ - రెహ్మాన్ లఖ్వీకి పాకిస్తాన్ కోర్టు శుక్రవారం 15 ఏళ్ల జైలు శిక్ష విధించింది. ఉగ్రవాదులకు నిధులు సరఫరా చేస్తున్నారన్న కేసులో ఉగ్రవాద వ్యతిరేక కోర్టు ఈ శిక్షను విధించింది. ముంబయి దాడి కేసులో 2015 నుండి బెయిల్‌పై ఉన్న 61 ఏళ్ల లఖ్వీని పంజాబ్ ప్రావిన్స్ కౌంటర్ టెర్రరిజమ్ డిపార్ట్‌మెంట్ (సిటిడి) శనివారం అరెస్ట్ చేసింది. ఉగ్రవాద నిరోధక చట్టం మిగతా 2లో..

# సీఎం జగన్‌కు కృతజ్ఞతలు: విజయసాయిరెడ్డి




**విశాఖపట్నం, జనవరి 8 (ప్రజా పాలన) :** ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని భారతదేశంలో అతి పెద్ద కార్యక్రమంగా నిలిపినందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం యలమంచిలిలో ఆయన ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'యలమంచిలి నియోజకవర్గంలో 7,200 ఇళ్ల పట్టాలు ఇవ్వడం జరిగింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మహిళలకు చేస్తున్న కార్యక్రమాలు మిగతా 2లో..


RED CROSS SOCIETY, BAPATLA
AMBEDKAR SEVA SAMAJAM
DEVELOPMENT OF MIGHTY EDUCATION CULTURE & SOPRTS SOCIETY
CARE ORGANISATION - KARLAPALEM
LIBERTY GOSPAL MINISTRIES
ADIVASI SAMKSHEMA SANGAM
SNEHA CLUB OF BAPATLA
Invites you for the
MEET and GREET
Grand Felicitation to
GURAJALA RAMA SRINIVAS
on his appointment as the Content Owner of
Bapatla Assembly Constituency
Under the Decentralized Policy by the Management of
AMBEDKAR TV
Date: 09-01-2021 at 4-00 p.m.
Venue: Bapatla Journalist Welfare Association Hall, Bapatla
Guests of Honour
Sri. Naralasetty Prakash Rao, Ex. Municipal Chirman & YSRCP Town President, Bapatla
Smt. Manam Vijetha, Ex. MPP, Bapatla
Sri. Moparthi John, Founder, CARE Organisation, Karlapalem
Sri. Katikala Samuel, Founder & President, Liberty Gospal Ministries
Dr. K. Vara Prasadarao, Convenor, Repalle Assembly - Ambedkar TV
Sri. Y. Bhupathi Rao, Convenor, Chirala Assembly - Ambedkar TV
Sri. B. Stanly Vimal Kumar, Chairman, Development of Mighty Education Culture & Soprts Society
Sri. Gujjarlapudi Charvaka, ANPS State President
Sri. K. Sundara Das, President, Sneha Club of Bapatla
Sri. B.S. Narayana Bhattu, Secretary, Redcross Society, Bapatla
Sri. Jogi Raja, Ambedkar Seva Samajam
Sri. A. Sreedhar, Convenor, Tenali Assembly - Ambedkar TV
Sri. Vejendla Srinivasa Rao, President- Bapatla Journalist Welfare Association, Bapatla
Sri. Uppala Murali Krishna, President, B.C. Welfare Association
Sri. Chejarla Sathish , State Secretary, Rajaka Sangham
Sri. Gorla Srinivasa Rao, President, B.C. Joint Action Commity
Sri. Sk. Jilani, Convenor, Anjuman Acadamic Committe, Bapatla
Sri. Tumati Babu Rao, Chairman, CSF Bapatla
Sri. Jitta Srinivasa Rao, President, Rotary Club of Bapatla
Smt. Yandamuri Usharani, Advocate, Lions Club of Bapatla Town
Sri. Tiruveedula Sankar Prasad, Chairman, Adivasi Samkshema Sangam
Sri. Patan Rajesh, Chairman, abdulkalam Foundation, Bapatla
Sri. Angirekula Vara Prasad, President, OBC Samkshema Sangam
Special Invitee
Dr. KATIKALA SIVA BHAGYA RAO,
IRS (VRS), Chairman Ambedkar T.V
Vote of thanks : D. Sanjay Kumar, Secretary Sneha Club, Bapatla

## 9 ఆలయాల పునర్నిర్మాణానికి సీఎం జగన్ భూమి పూజ

(మొదటిపేజీ తరువాయి)

మేకా ప్రతాప్ వెంకట అప్పారావు, కైలే అనిల్ కుమార్, దేవాదాయ శాఖ కార్యదర్శి గిరిజా శంకర్, కమిషనర్ అర్జున రావు, కలెక్టర్ ఇంతియాజ్, సీపీ శ్రీనివాసులు, వీఎంసి కమీషనర్ ప్రసన్న వెంకటేష్, జేసి మాధవీలత, సబ్ కలెక్టర్ ధ్యాన చంద్, దేవాదాయ అధికారి చంద్ర శేఖర్ ఆజాద్, ఆలయ ప్రధాన అర్చకులు దుర్గాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు. దేవాదాయ శాఖ క్యాలెండర్ ఆవిష్కరణ సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి రాష్ట్రంలో టెంపుల్ టూరిజంపై ప్రత్యేక దృష్టి సారించి అందుకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు సూచించారు. రాష్ట్రంలోని అన్ని ప్రముఖ ఆలయాలతో రూపొందించిన క్యాలెండర్‌ను ముఖ్యమంత్రి చూసి అధికారులను అభినందించారు. ఆయా దేవస్థానాల్లో నిర్వహించే వేడుకలను ప్రతిబింభించేలా క్యాలెండర్‌ను రూపొందించారు.

## సీఎం జగన్‌కు కృతజ్ఞతలు: విజయసాయిరెడ్డి

(మొదటిపేజీ తరువాయి)

అనిర్వచనీయం. ఇలాంటి ముఖ్యమంత్రి మరో 25 సంవత్సరాలు ఉండాలని రాష్ట్ర ప్రజలు ఆశీర్వదించాలి. సీఎం మహిళా పక్షపాతిగా నిరూపించుకుంటూ వారి ఉజ్వల భవిష్యత్తుకు తోడ్పడుతున్నారు. అవినీతి లేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారు' అని విజయసాయిరెడ్డి అన్నారు.

## ముంబయి దాడి సూత్రధారికి 15 ఏళ్ల జైలుశిక్ష

(మొదటిపేజీ తరువాయి)

1997లోని వివిధ సెక్షన్ల కింద 15 ఏళ్ల కిందట నమోదు చేసిన ఈ కేసులో లాహోర్‌లోని ఉగ్రవాద వ్యతిరేక కోర్టు (ఎటిసి) లఖ్వీని దోషిగా తేల్చింది. ఒక్కో కేసుకు ఐదేళ్ల చొప్పున మొత్తం 15 ఏళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ.. న్యాయమూర్తి ఎజాజ్ అహ్మద్ బట్టర్ తీర్పు చెప్పారు. అలాగే ఒక్కో కేసులో లక్ష పాకిస్థాన్ రూపాయిల జరిమానా విధించారు. జరిమానా చెల్లించకుంటే అదనంగా మరో ఆరు నెలల చొప్పున ఏడాదిన్నర పాటు అదనంగా జైలు శిక్ష అనుభవించాల్సి వుంటుందని తీర్పులో పేర్కొన్నారు. కాగా, 2008 ముంబయి దాడుల అనంతరం ఐక్యరాజ్యసమితి లఖ్వీని ప్రపంచ ఉగ్రవాదుల జాబితాలో చేర్చింది.

## 'దేవుడిని అడు పెట్టుకుని రాజకీయం సరికాదు'



**ఏలూరు, జనవరి 8 (ప్రజాపాలన) :** లక్ష మంది పనిచేస్తున్న మహిళా స్త్రీ, శిశు సంక్షేమశాఖకు మంత్రిగా పనిచేసే అవకాశం ఇవ్వడం నా అదృష్టమని మంత్రి తానేటి వనిత అన్నారు. మహిళా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న వివిధ సంక్షేమ పథకాల అమలుపై పశ్చిమగోదావరి జిల్లాలో రాష్ట్ర స్థాయి సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి మంత్రి వనిత, ప్రిన్సిపల్ సెక్రటరీ అనురాధ, డైరెక్టర్ కృతికా శుక్లా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి తానేటి వనిత మాట్లాడుతూ.. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం జగన్ మహిళలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. మహిళల పథకాలపై సీఎం దృష్టికి తీసుకెళ్లినపుడు వెంటనే స్పందిస్తారు. 12 సంవత్సరాలుగా ఈ శాఖలో ప్రమోషన్లు రాలేదు. అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోపే సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్లగా ఆమోదం తెలిపారు. గత ప్రభుత్వంలో ఈ శాఖకు నిధులు కూడా కొరతే. సంవత్సరానికి రూ.500 కోట్లు కేటాయిస్తే, నేడు జగనన్న ప్రభుత్వం రూ.1,800 కోట్లు కేటాయించింది. గర్భవతులకు వైఎస్సార్ సంపూర్ణ పోషణతో నాణ్యమైన ఆహారాన్ని అందిస్తున్నారు. అమ్మ ఒడి పథకం ద్వారా మహిళల అకౌంట్‌లలో డబ్బులు జమ చేస్తున్నారు. మహిళలు పారిశ్రామికంగా అభివృద్ధి చెందడానికి చేయూత కార్యక్రమం ప్రారంభించారు. మహిళలు రాజకీయంగా ముందుండేందుకు నామినేటెడ్ పదవుల్లో 50 శాతం అవకాశం కల్పించారు. మహిళలు, చిన్నారుల భద్రతకు అండగా ఉండేందుకు దిశ చట్టాన్ని తీసుకొచ్చారు' అని మంత్రి తానేటి వనిత పేర్కొన్నారు.

## మండల దీక్ష మాలాధారణ కార్యక్రమం



**పెనుగంచిప్రోలు, జనవరి8. ప్రజాపాలన :** పెనుగంచిప్రోలు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ గోపయ్య సమేత శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానంలో ప్రారంభమైన మండల దీక్ష మాలాధారణ కార్యక్రమం, శుక్రవారం ఉదయం 06గం 04ని. లకు ముందుగా దేవస్థాన ప్రధాన అర్చకులు మర్రిబోయిన వెంకట రమణ గురు స్వామి మాలధారణ చేసుకొని, అనంతరం భక్తులకు మండల దీక్ష మాలధారణ కార్యక్రమాన్ని ప్రారంభించారు, మాలాధారణ చేసుకునే భక్తులకు కోవేడ్ -19 నిబంధనల ప్రకారం ఎటువంటి ఇబ్బందులు లేకుండా దేవస్థాన కార్యనిర్వాహణాధికారి ఎ న్ వి ఎస్ ఎన్ మూర్తి ఏర్పాట్లు చేశారు.

## క్రీడలను ప్రోత్సహించడం అభివృద్ధికి చిహ్నం: హెచ్.ఎం.



**పొన్నూరు, ప్రజాపాలన :** క్రీడలను ప్రోత్సహించడం అభివృద్ధికి చిహ్నంగా చెప్పాలని వెల్లలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయరాలు కె.లతాప్రియదర్శిని అన్నారు. శుక్రవారం పవర్ లిఫ్టింగ్ క్రీడలో ప్రతిభ చాటుకున్న విద్యార్థులను పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ఘనంగా అభినందించారు. ఈ సందర్భంగా క్రీడా పరికరాలు నిమిత్తం రూ 10వేలు నగదును క్రీడాకారులకు అందజేశారు. క్రీడలు దేశ ప్రగతికి చిహ్నాలు అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.







# ఇంద్రకీలాద్రిపై అమ్మవారిని దర్శించుకున్న ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి

- ఆలయ చైర్మన్, ఈఓ, ప్రధాన అర్చకులు తదితరులు స్వాగతం
- వివిధ ఆలయాలపై రూపొందించిన క్యాలండర్ ఆవిష్కరించిన ముఖ్య మంత్రి

**విజయవాడ, జనవరి 8 (ప్రజా పాలన) :** ఇంద్రకీలాద్రికి చేరుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి వెలంపల్లి శ్రీనివాస రావు, ఆలయ చైర్మన్ పైలా స్వామినాయుడు ఈఓ ఎమ్ సురేష్ బాబు , ఆలయ ప్రధాన అర్చకులు ఎల్లి ప్రసాద్ , స్థాన చార్యులు వి.శివ ప్రసాద్ , కోటా రవి , తదితరులు స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారిని ముఖ్యమంత్రి దర్శించుకున్నారు. తదుపరి వేద పండితులు ఘనాపాటీలు ఆంజనేయ శర్మ , వివి ఎల్ ఎన్ ఘనాపాటి , వెంకటేశ్వర రావు , రామకృష్ణ ఆశీర్వచనాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు వెలంపల్లి శ్రీనివాసరావు , బొత్సా సత్యనారాయణ , పేర్ని నాని , కొడాలి నాని , సీఎం కార్యక్రమాల సమన్వయ కర్త తలశిల రఘురాం , బ్రాహణ కార్పొరేషన్ చైర్మన్ మల్లాది విష్ణు , ఎమ్మెల్యే కె . పార్ధసారధి , జోగి రమేష్ , మేకా ప్రతాప్ వెంకట అప్పారావు , కైలే అనిల్ కుమార్ , దేవాదాయ శాఖ కార్యదర్శి గిరిజా శంకర్ , కమీషనర్ అర్జున రావు , కలెక్టర్ ఇంతియాజ్ , సీపీ బి . శ్రీనివాసులు , వీఎంసి కమీషనర్ ప్రసన్న వెంకటేష్ , జేసి మాధవీలత , సబ్ కలెక్టర్ ధ్యాన చంద్ , దేవాదాయ అధికార చంద్ర శేఖర్ ఆజాద్ , ఆలయ ప్రధాన అర్చకులు దుర్గాప్రసాద్ , తదితరులు పాల్గొన్నారు. ఆలయ వేదపండితులు ఆశీర్వచనాలు పలికి అమ్మవారి జ్ఞాపిక , చిత్రపటము , వస్త్రాము , ప్రసాదం అందచేసారు . దేవాదాయ శాఖ రాష్ట్రము లోని వివిధ ఆలయాలపై రూపొందించిన క్యాలండర్ ముఖ్య మంత్రి ఆవిష్కరించారు.

# 'రద్దు'కే రైతన్నలు.. కష్టమన్న కేంద్రం

(మొదటిపేజీ తరువాయి)

సోమ్ ప్రకాశ్ శుక్రవారం మధ్యాహ్నం సమావేశ మయ్యారు. అయితే చర్చలు ప్రారంభమైన కాసేపటికే ఇరు వర్గాలు తమ డిమాండ్లపై వెనక్కి తగ్గలేదు. కొత్త చట్టాలను దేశ ప్రజలందరి కోసం తీసుకొచ్చామని, ఇవి ఏ ఒక్క రాష్ట్రానికి పరిమితం కావని మంత్రుల బృందం తెలిపింది. చట్టాలను రద్దు చేయడం కుదరదని చెప్పినట్లు సమాచారం. 'చట్టాలను రద్దు చేయలేం. కావాలంటే మీరు సుప్రీంకోర్టు వెళ్లొచ్చు. ఈ చట్టాలు అక్రమమని న్యాయస్థానం చెబితే మేం ఉపసంహరించుకుంటాం. ఒకవేళ చట్టబద్ధమైనవేనని తీర్పు వస్తే మీరు ఉద్యమాన్ని విరమించుకోవాలి' అని మంత్రుల బృందం రైతులకు వివరించినట్లు విశ్వసనీయ వర్గాలు పేర్కొన్నాయి. అయితే ఇందుకు రైతు నాయకులు అభ్యంతరం తెలిపినట్లు తెలుస్తోంది. సుప్రీం ప్రక్రియకు చాలా సమయం పడుతుందన్న రైతు ప్రతినిధులు.. చట్టాలను రద్దు చేయాల్సిందేనని పట్టుబట్టారు. 'చట్టాలను వెనక్కి తీసుకుంటేనే మేం ఇళ్లకు వెళ్లిపోతాం' అని రైతులు చెప్పినట్లు సదరు వర్గాలు తెలిపాయి.

**ఏకాభిప్రాయం కుదరలేదు: తోమర్**

రైతు సంఘాల ప్రతినిధులతో జరిగిన చర్చల్లో ఏకాభిప్రాయం కుదరలేదని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి నరేంద్రసింగ్ తోమర్ అన్నారు. చట్టాలు రద్దు చేయడం తప్ప మరో ప్రత్యామ్నాయం చెప్పాలని రైతులను కోరామన్నారు. దేశంలో చాలా మంది చట్టాలను సమర్ధిస్తున్నారని, రైతులతో మరోసారి ఈ నెల 15న చర్చలు జరుపుతామని మంత్రి తెలిపారు.

**ప్రజాస్వామ్యం అపహాస్యం: రైతులు**

"కేంద్రం ఇవాళ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసింది. చర్చల్లో సాగు చట్టాల రద్దు కుదరని చెప్పింది. ఇతర రైతు సంఘాలు సాగు చట్టాలకు మద్దతు ఇస్తున్నాయి. కాబట్టి చట్టాలను వెనక్కి తీసుకోలేమని చెప్పింది. సుప్రీంకోర్టు నిర్ణయానికే వదిలేస్తే మంచిదని బాధ్యతా రాహిత్యంగా వ్యవహరించింది. చర్చలు జరుగుతున్న వేళ కేంద్రం మధ్యలో తప్పుకొని సుప్రీంకోర్టు తేలుస్తుందని అనడం దేనికి నిదర్శనం? సాగు చట్టాల రద్దు తప్ప మరేదీ ఆమోద యోగ్యం కాదని చెప్పాం. సాగు చట్టాలు రద్దు చేస్తేనే ఆందోళన విరమిస్తాం" అని అఖిల భారత రైతు పోరాట సమన్వయ సమితి నేత కవిత కురుగంటి అన్నారు. హాలు నుంచి వచ్చేసిన మంత్రులు రైతులు తమ డిమాండ్లపై వెనక్కి తగ్గకపోవడంతో కేంద్ర మంత్రులు సమావేశ గది నుంచి బయటకు వచ్చేశారు. అధికారులతో సంప్రదింపులు జరిపారు. అదే సమయంలో రైతు సంఘాల నేతలు గదిలో మౌనం పాటించారు. 'విజయం లేదా వీరమరణం' అనే రాసి ఉన్న పేపర్లు పట్టుకుని నిరసన తెలిపారు. అంతేగాక, భోజనం చేసేందుకు కూడా రైతులు నిరాకరించారు. భోజన విరామ సమయంలోనూ సమావేశ గదిలోనే ఉండిపోయారు.

# రాష్ట్రంలో ఫస్ట్ ఇంటర్ తరగతుల ప్రారంభం

(మొదటిపేజీ తరువాయి)

కాంపిటీటివ్ పరీక్షలకు ఇబ్బందులు కలుగకుండా ఉండేలా ఇంటర్ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఏప్రిల్, మే నెలల్లో పరీక్షలు నిర్వహించే అవకాశముందని, ఇందుకు సంబంధించిన పరీక్షల షెడ్యూల్ త్వరలో విడుదల చేస్తామని మంత్రి వెల్లడించారు. కరోనా కారణంగా సిలబస్ లో 30 శాతం మేర తగ్గించామన్నారు. ఇందుకు సంబంధించి సబ్జెక్టుల వారీగా సిలబస్ వివరాలను ఆయా కళాశాలకు అందజేశామన్నారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా తరగతులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి హెచ్చరించారు. ఈ ఏడాది విద్యా సంవత్సరం ఉండకపోవొచ్చునంటూ వస్తున్న వార్తలను ఆయన ఖండించారు. ప్రతి ఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహిస్తామన్నారు.

**అధిక ఫీజులు వసూలు చేస్తే గుర్తింపు రద్దు**

కోర్టు ఉత్తర్వుల ఆధారంగా ఈ ఏడాది ఆఫ్ లైన్లో ఇంటర్ మొదటి సంవత్సరం అడ్మిషన్లకు అనుమతులు మంజూరు చేసినట్లు మంత్రి ఆదిమూలపు సురేష్ వెల్లడించారు. అడ్మిషన్ల విషయంలో ఇష్టారాజ్యంగా వ్యవహరించిన కళాశాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిం చారు. కరోనా నిబంధనలకనుగుణం గా ఫీజులు వసూలు చేయాలన్నారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు ఇప్పటికే విడుదల చేశామన్నారు. గతేడాది వసూలు చేసిన ఫీజులులో 30 శాతం రాయితీ ఇచ్చి, 70 శాతం మేర ఫీజులు వసూలు చేయాలన్నారు. ప్రభుత్వ నిబంధనలను బేఖాతరు చేసినా, కరోనా గైడ్ లైన్స్ ను పాటించకున్నా కళాశాలపై కఠిన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే ఆయా కళాశాలల గుర్తింపులు సైతం రద్దు చేస్తామని మంత్రి హెచ్చరించారు. కరోనా గైడ్ లైన్స్ ను, అధిక ఫీజులు వసూలు చేసే కళాశాలల అక్రమాలను తమ దృష్టికి తీసుకురావాలనుకున్నవారు 9391282578 వాట్సాప్ నెంబర్ కు గాని, ourbieap@gmail.com మెయిల్ గాని సమాచారమందిస్తే సంబంధిత కళాశాలలపై చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. ఇటీవల వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా ఈ నెల 5వ తేదీన విజయవాడ (గొల్లపూడి)కి చెందిన నారాయణ విద్యా సంస్థలో ఆకస్మిక తనిఖీలు చేశామన్నారు. ఈ తనిఖీల్లో పలు అంశాలు గుర్తించామన్నారు. అధికారుల నుంచి వచ్చే రిపోర్టుల ఆధారంగా ఆ కళాశాలపై చర్యలు తీసుకుంటామన్నారు. త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా మరిన్ని ఆకస్మిక తనిఖీలు నిర్వహించనున్నామని మంత్రి వెల్లడించారు.

**సర్టిఫికెట్లు ఇవ్వకుంటే కఠిన చర్యలు...**

కరోనా కారణంగా ఇంటర్మీడియట్ పరీక్ష ఫీజులు పెంచడం లేదని మంత్రి ఆదిమూలపు సురేష్ తెలిపారు. గత ఏడాది మాదిరిగానే ఫీజులు వసూలు చేయనున్నామన్నారు. గతంలో ఏటా 30 శాతం మేర పరీక్ష ఫీజులు పెంచేవారన్నారు. కరోనా దృష్ట్యా ఇంటర్మీడియట్ బోర్డుకు ఆర్థిక ఇబ్బందులున్నా ఫీజులు పెంచడంలేదన్నారు. గతేడాది మాదిరిగానే మొదటి సంవత్సరం పరీక్షకు రూ.500లు, రెండో సంవత్సరానికి రూ.680లు చెల్లిస్తే సరిపోతుందన్నారు. అడ్మిషన్లకు సంబంధించిన గైడ్ లైన్స్ ను ఇప్పటికే అన్ని కళాశాలకు పంపించామన్నారు. అడ్మిషన్ల సమయంలో టెన్త్ క్లాస్, ఇతర సర్టిఫికెట్లను పరిశీలించి, తిరిగి విద్యార్థులకు ఇచ్చివేయాలన్నారు. అలాకాకుంటే సంబంధిత కళాశాలలపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సర్టిఫికెట్లు తిరిగి ఇవ్వని కళాశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఇప్పటికే డీజీపీని కోరామన్నారు.

**ఈ నెల 11న జగనన్న అమ్మఒడి రెండో విడత చెల్లింపులు...**

ఈ నెల 11 వ తేదీన జగనన్న అమ్మ ఒడి రెండో విడత చెల్లింపులు చేపట్టనున్నట్లు మంత్రి ఆదిమూలపు సురేష్ వెల్లడించారు. నెల్లూరులో సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి చేతుల మీదుగా ఆన్ లైన్ ద్వారా విద్యార్థుల తల్లుల ఖాతాలో నేరుగా జగనన్న అమ్మఒడి చెల్లింపులు జమ చేయనున్నామన్నారు. ఇప్పటికే పారదర్శకంగా ఎంపిక చేసిన అర్హుల జాబితాను పాఠశాలలు, గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రదర్శనకు పెట్టామన్నారు. గతేడాది కంటే ఈ ఏడాది ఇంకా ఎక్కువ మంది లబ్ధిదారులకు జగనన్న అమ్మఒడి పథకం కింద ఎంపిక చేశామన్నారు. రెండో విడత జగనన్న అమ్మఒడి రెండో విడత చెల్లింపుల కార్యక్రమం నిర్వహణకు జిల్లా, నియోజకవర్గ స్థాయిలో నిర్వహించేలా షెడ్యూల్ రూపొందించామన్నారు. జిల్లా స్థాయిలో మంత్రులు, నియోజక వర్గ స్థాయిలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఈ కార్యక్రమాల్లో పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమాల నిర్వహణ సమయంలో కొవిడ్-19 నిబంధనలు పాటించేలా గైడ్ లైన్స్ రూపొందించామని, వాటిని పాటించేలా అధికారులకు ఉత్తర్వులు జారీచేశామన్నారు.

## రైతును పూర్తిగా నరికేసారు : తెదేపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవినేని ఉమామహేశ్వరరావు



**వీరులపాడు, జనవరి 8 ప్రజా పాలన :** వీరులపాడు మం డలం చెన్నారావుపాలెం లోవరుస తుఫాన్లు వరదల తో పంటలకు తెగుళ్లు సోకి దిగుబడులు తగ్గడం, పం ట సాగు పెట్టుబడులు పెరగటం, పైపంటలకు ఇన్‌పుట్ సబ్సిడీ అందకపోవటం వెరశి రైతులు పూర్తిగా కు దేలయ్యారని రాష్ట్రంలో ఇటువంటి పరిస్థితులు మునుపెన్నడూలేవని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిది ఏమి పాదమో కానీ ఇటువంటి దౌర్భాగ్య పరి స్థితులను రైతులు ఎదుర్కొనడం దురదుష్టకరమని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వర రావు పేర్కొన్నారు. శుక్రవారం వీరులపాడు మండలంలోని చెన్నారావుపాలెంలో గ్రామ పర్యటనలో మొక్కజొన్న కల్లా లను మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య, దేశం నాయకులు, రైతులతో కలసి పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ మొక్కజొన్న రైతులు ఎకరానికి 40 వేలు పెట్టుబడులు పెట్టారు. ముప్పై నుంచి నలభై క్వింటాళ్లు అయ్యేది కనీసం 15 క్వింటాల్ కూడా అవ్వలేదు కొనే పరిస్థితి లేదు కొన్న వాటికికూడా ఇంతవరకు డబ్బులు ఇవ్వలేదు రైతులను నీది ఏ కులం ఏ మతం అని అడిగి అడుగుతున్నారు ఇంతకు ముందు ఇటువంటి దౌర్భాగ్య పరిస్థితి ఏ ముఖ్యమంత్రి కూడా చేయలేదు రాజకీయ నాయకులు ఇంటికి వెళ్తే స్లిప్పు ఇస్తారంటా ఇలాంటి పరిస్థితి ఇంతకు ముందు ఎన్నడూ లేదునీ రైతు బోరోసా కేంద్రాలు అంత బోగస్ ఈక్రాప్ విధానం అంత బోగస్ కౌ లు రైతులను గాలికొదిలేశారు 15 లక్షలు కౌలు రైతు లు ఉంటే మీ లెక్కలు లక్ష కూడా లేదుగతంలో 13 ల క్షల మంది కౌలు రైతులకు డబ్బులు ఇచ్చాముపత్తి మూడు నాలుగు క్వింటాలు కాలేదు జగన్మోహన్ రెడ్డి గారు 5వేలు రావాల్సిన పత్తి ని 3 వేలు, 4 వేలకు ద ళారులు దోచుకుంటున్నారు రైతులకు ఇటువంటి దౌ ర్భాగ్యమైన పరిస్థితి ఎప్పుడూ రాలేదుజగన్మోహన్ రెడ్డి గారు మిర్చి పెట్టుబడి ఎకరానికి లక్ష రూపాయల అవుతుంది ఒకొక్క మొక్క మూడు నాలుగు రూపా యల ఖర్చు అవుతుంది మినుము, పత్తి, పెసలు అ న్ని పంటలు పోయాయిసుబాబులు పక్క రాష్ట్రంలో 3 వేలు అమ్ముతుంది ఇక్కడ 12 వందలు కూడా కొనే దిక్కు లేదు శాసన సభలో ఉత్తరకుమారుడు ప్రగల్భా లు పలికారు సుబాబు రైతులను ఉద్ధరిస్తామని చెప్పి రైతు ను పూర్తిగా నరికేశారుపంపు సెట్టుకు మీటర్లు పె ట్టి రైతు మేడకు ఉరి వేస్తారా ? గ్రామంలో రైతులు క్షే మంగా ఉంటేనే గ్రామం బాగుంటుంది రైతు కళ్లలో క న్నీరుకు బదులు రక్తం వస్తుంది క్షేత్ర స్థాయిలో పరిశీ లించే తీరిక మీకు లేదు ఈ కార్యక్రమంలో మండల అ ధ్యక్షులు శ్రీనివాస్ కుమార్ మధుసూదన్ రావు భ ర త్ రెడ్డి కాపా రాంబాబు పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## దుర్మార్గపు ఆలోచనలతోనే ఆలయాలపై దాడులు

### సర్వమత పెద్దల సమావేశంలో మంత్రి బొత్స సత్యనారాయణ



**తాడేపల్లి, జనవరి 8 (ప్రజాపాలన) :** ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పరిపాలన చూసి ఓర్వ లేక ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు కుట్రలు చేస్తున్నారని మున్సిపల్ శాఖ మంత్రి బొత్స సత్య నారాయణ మండిపడ్డారు. ఆయన శుక్రవారం విజయవాడలో జరిగిన సర్వమత పెద్దల సమావేశంలో మాట్లాడారు. అధికారం వచ్చిన నాటి నుంచి ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామని, అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా సీఎం పనిచేస్తున్నారని చెప్పారు.

## నూతన వస్త్ర బహూకరణ వేడుకలు



**బాపట్ల, ప్రజాపాలన :** బాపట్ల పట్టణానికి చెందిన కాంట్రాక్టర్ గుమ్మడి కుమారుల నూతన వస్త్ర బహుకరణ కార్యక్రమానికి హాజరై వారిని ఆశీర్వదించిన బాపట్ల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ వేగేశానా నరేంద్ర వర్మ బాపట్ల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ గౌరవ అధ్యక్షులు నారాయణ కర్లపాలెం మండలం తెలుగుదేశం పార్టీ మాజీ అధ్యక్షులు నక్కల వెంకటస్వామి, మాజీ ఎంపిటిసి షేక్ బాజీ తదితరులు..పాల్గొన్నారు

## చంద్రబాబు అనుచిత వ్యాఖ్యలపై కృష్ణాజిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసిన జాన్ బెన్నీ



**గుడ్లవల్లేరు, ప్రజాపాలన :** రాష్ట్రంలో ప్రస్తుతం జరుగుతున్న హిందూ దేవాలయాలలో విగ్రహాల ధ్వంసం ఘటనల గురించి చంద్రబాబు నాయుడు క్రైస్తవులపై చేస్తున్న అనుచిత వ్యాక్యలపై అసోసియేషన్ ఆఫ్ ఇంటిగ్రేటెడ్ క్రిస్టియన్ కౌన్సిల్ జాతీయ అధ్యక్షులు జాన్ బెన్నీ లింగం మరియు సభ్యులు కృష్ణాజిల్లా ఎస్పీ రవీంద్ర బాబుకు వారి కార్యాలయంలో పిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రం లో ప్రస్తుతం జరుగుతున్న మత ఘర్షణలపై విచారణ వ్యక్తం చేస్తున్నామని ఒక క్రైస్తవుడిగా జరుగుతున్న పరిణామాల పై వేదనతో వున్నానని అన్నారు . కానీ ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు క్రైస్తవులపై చేసిన వ్యాఖ్యలకు గాను మా క్రైస్తవుల మనోభావాలు దెబ్బతిన్నాయి, తీవ్ర అవమానకరంగా ఉన్నాయి. బలవంతపు మతమార్పిడి కి క్రైస్తవులు పాల్పడుతున్నారు అని అంటున్న చంద్రబాబు నాయుడు మా క్రైస్తవులపై అసహ్యంతో, పగబట్టి విగ్రహాలను తన మనుషులతో పగలగొట్టించి ఆ నెపం క్రైస్తవుపై వేస్తున్నారని అనుమానం కావున చంద్రబాబు నాయుడుని అదువులోకి తీసుకుని విచారించి నిజానిజాలు బయటకు పెట్టాలని తన వ్యాఖ్యలతో హిందువులకు క్రైస్తవులకు మధ్య స్నేహపూరిత వాతావరణం దెబ్బతింటుందని కావున వెంటనే చంద్రబాబు నాయుడు ని అదుపులోకి తీసుకుని తగు విచారణ చేపట్టవలసిందిగా కోరారు. అంతేకాక తమ ద్వారా ప్రభుత్వానికి ఒక సిఫారసు చేయవలసిందిగా ఎస్పీ ని కోరారు. అలాగే ఈ విషయంపై సిబిఐ దర్యాప్తు చేసి చేసి నిజాలను నిగ్గుతేల్చాని అన్నారు. అలాగే జాన్ బెన్నీ మాట్లాడుతూ చంద్రబాబు హయాంలో ఎక్కడ క్రైస్తవ కార్యక్రమాలు జరిగితే అక్కడికి వెళ్లి బైబిల్ పట్టుకుని యెహోవా నా కాపరి యెహోవా నా కాపరి అన్న విషయం మర్చిపోయావా? ఇకనైనా బుద్ధి మారకపోతే రాష్ట్ర ప్రజలు ఊరుకోరు మూడు మతాల మధ్య చిచ్చు పెడతూ ఒక పిచ్చి కుక్క లాగా ప్రవర్తిస్తున్నావు, ప్రజలందరూ గమనిస్తున్నారు చంద్రబాబు నాయుడు ఇకనైనా జాగ్రత్త ఉండమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గుడ్లవల్లేరు మండల అధ్యక్షులు రెవ. పి విజయ రాజు స్టేట్ సెక్రటరీ ఎం జయరాజు వైస్ ప్రెసిడెంట్ జి ఫ్రాన్సిస్ ట్రెజరర్ కె జయరాజు తదితరులు పాల్గొన్నారు.






# నరసరావుపేట రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులపై సమీక్ష

### సమక్ష నిర్వ హించిన నరసరావుపేట ఎమ్మెల్యే డా.గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి , ఎంపీ లావు శ్రీ కృష్ణ దేవరాయలు ,రైల్వే మేనేజర్ మెహన్ రాజా

**నరసరావుపేట. ప్రజాపాలన :** దినదినాభివృద్ధి జరుగుతూ అన్ని రంగాల్లో మేటిగా నిలుస్తూ,అతి త్వరలో జిల్లా హెడ్ క్వార్టర్స్ కానున్న నరసరావుపేట పట్టణానికి అన్నిరకాల హంగులు పొందుపరిచే క్రమంలో నేడు ప్రస్తుత జనాభా మరియు వ్యాపార రంగాభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని రైల్వే స్టేషన్ అభివృద్ధి కొరకు డివిషనల్ రైల్వే మేనేజర్ మోహన్‌రాజాతో సమీక్షించిన నరసరావుపేట శాసనసభ్యులు డా. గోపి రెడ్డి శ్రీనివాస రెడ్డి , పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణ దేవరాయలు . నరసరావుపేట రైల్వే స్టేషన్ నందు ప్లాట్ఫామ్ విస్తరణ, ట్రాక్ విస్తరణ పనులు మరియు ఎలివేటర్ నిర్మాణం. పార్క్ అభివృద్ధి మరియు స్టేషన్ ఆవరణలో మొక్కలు పెంచటం. నూతన భవనాలు నిర్మాణం , ప్లాట్ ఫాం పొడుగునా రూఫింగ్ ఏర్పాటు చేయటం, విశ్రాంత గదులు నిర్మాణం మరియు జనాభాకు తగిన విధంగా పార్కింగ్ స్థలం ఏర్పాటు చేయటం. నరసరావుపేట అభివృద్ధి కొరకు రైల్వే శాఖ వారికి శాసనసభ్యులు డా.గోపిరెడ్డి వినతులు: పట్టణంలోని పనసతోట వద్ద శ్రీ కృష్ణ చిత్రాలయ ను అనుసందానిస్తూ రైల్వే అండర్ బ్రిడ్జ్ నిర్మాణం. ఈ నిర్మాణం వలన నరసరావుపేట పట్టణ పరిధిలో అత్యంత రద్దీ ప్రాంతమైన మల్లమ్మ సెంటర్ నందు రైల్వే ఓవర్ బ్రిడ్జ మీద ట్రాఫిక్ తగ్గి ప్రమాదాలు తగ్గుముఖం పడతాయి. ఆర్టీసీ బస్సులు ఈ బ్రిడ్జ ద్వారా వెళ్లినట్లైతే ట్రాఫిక్‌ను చాలా వరకు నియంత్రించవచ్చు. క్రిస్టియన్ పాలెం, బాబా పెట్ నందు ప్రజల సౌకర్యార్థం రైల్వే ఓవర్ బ్రిడ్జ కు మెట్లు ఏర్పాటు చేయవలెను. అరుండల్ పేట నుండి ప్రకాష్ నగర్ వైపు పోవు రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద రిపేర్ పనులు కొరకు ప్రస్తావించగా మునిసిపల్ అధికారుల పరిధిలో ఉన్నందున ఆ పనులు త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించడం జరిగింది. స్టేషన్ రోడ్ నంద్ పోస్ట్ ఆఫీస్ వద్ద గల-బెండ్ రోడ్డు వలన ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతున్నందున రైల్వే స్థలం నందు రోడ్ నిర్మాణం చేసినట్లయితే చాలా వరకు ట్రాఫిక్ ను నియంత్రించగలమని తెలుపగా, ఆ స్థలానికి సంబంధించి పై అధికారులతో సంప్రదించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. గతంలో బాబాపేట వద్ద నిర్మించిన కల్వర్ట్ వద్ద పోల్స్ మరియు నిర్మాణ సామగ్రి అడ్డుపడటం వలన వరదలు వచ్చినప్పుడు 6 వ వార్డ్ ముంపునకు గురవుతోందని తెలుపగా రైల్వే వారు సత్వరమే స్పందించి క్లియర్ చేయటం జరిగింది. ఈ సందర్భంగా డివిసినల్ రైల్వే మేనేజర్ మాట్లాడుతూ ఎమ్మెల్యే, ఎంపీ సూచనలు తప్పకుండా పరిగణలోకి తీసుకుని రైల్వే స్టేషన్ అభివృద్ధి పథకంలో నడిపిస్తామని తెలిపారు. మునిసిపల్ అధికారులు, రైల్వే అధికారులు పాల్గొన్నారు.

## యువతకు చదువుతో పాటు క్రీడలు ఎంతో అవసరం





**కారంపూడి, ప్రజాపాలన :** మండలం ఇనపరాజుపల్లి గ్రామం లో సంక్రాంతి పండగ సందర్భంగా కాపు సంఘం ఆధ్వర్యంలో జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జనసేన పార్టీ నాయకులు కటకం అంకారావు, కిరణ్ పాల్గొని రిబ్బన్ కట్ చేసి టోర్నమెంట్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ నాయకులు అంకారావు మాట్లాడుతూ, యువతకు చదువుతో పాటు క్రీడలు కూడా చాలా అవసరమని ఆయన తెలిపారు. క్రీడల వల్ల మానసిక ఉల్లాసం యువతకు దొరుకుతుందని ఆయన అన్నారు. టోర్నమెంట్ లో ఎటువంటి వివాదాలకు తావు ఇవ్వకుండా నిర్వహించాలని, కమిటీ సభ్యులను ఆయన కోరారు. ఈ టోర్నమెంట్ కు మొదటి బహుమతి ఇనుప రాజు పల్లి గ్రామ పెద్దలు 15000, రెండవ బహుమతి కొరకూటి పిచ్చయ్య జ్ఞాపకార్థం 12000, మూడో బహుమతి పురంశెట్టి అంకుల్ జ్ఞాపకార్థం 10000, నాలుగో బహుమతి రాజనాల నరసయ్య జ్ఞాపకార్థం 7000 వారి కుమారులు అందజేస్తూన్నరని కమిటీ సభ్యులు తెలిపారు. రాజనాల గోపి, పినరాతి నాగేంద్ర బాబు, ఆకుల రవితేజ,ఈ టోర్నమెంట్కు అధ్యక్షత వహిస్తున్నారు.

## జీఎన్టీయు కళాశాల భవనాలకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గోపిరెడ్డి



**నరసరావుపేట, ప్రజాపాలన :** ఎన్నో ఏళ్ల నిరీక్షణకు నేడు తెరదించుతూ నరసరావుపేటకు తలమాణికమైన జేఎన్టీయూ కళాశాల నిర్మాణానికి సంబంధించి 120 కోట్ల రూపాయలతో అన్ని రకాల అనుమతులు పొంద డంలో కీలకపాత్ర వహించి దాదాపు నరసరావుపేట లో జేఎన్టీయూ కళాశా లను నిర్వర్యం చేస్తున్న తరుణంలో నరసరావుపేట శాసనసభ్యులు డా. గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి కృషితో నేడు ఈ దశకు చేరుకుని శాశ్వత భవనాలకు శంఖుస్థాపన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యాశాఖ చైర్మన్ ప్రొ. కె. హేమచంద్రరెడ్డి ,వైస్ ఛాన్సలర్ ప్రొ. ఎం.రామలింగ రాజు, రిజిస్ట్రార్ డా.సిహెచ్. సత్యనారా యణ , రెక్టర్ డా.జీ. వి.ఆర్.ప్రసాద్ రాజు ,చీఫ్ ఇంజినీర్ డా.జీ. యేసు రత్నం , ప్రిన్సి పాల్ సుబ్బారావు, కళాశాల అభివృద్ధి కమిటీ మెంబెర్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు , దానారెడ్డి , యోగంజానేయ శర్మ, చిత్రా కృష్ణారెడ్డి , మండల కన్వీనర్ మొరబోయిన శ్రీనివాసరావు ,చల్లా నారపరెడ్డి పాల్గొన్నారు.

## నడికుడి రైల్వేస్టేషన్ అభివృద్ధి కార్యక్రమంలో పాల్గున్న ఎంపీ శ్రీ కృష్ణ దేవరాయలు





**దాచేపల్లి. ప్రజాపాలన :** పిడుగురాళ్ల, నడికుడి రైల్వేస్టేషన్లకు సంబంధించిన అభివృద్ధి కార్యక్రమాలు, చేపట్టాల్సిన కార్యచరణ గురించి.. నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి గుంటూరు డిఆర్‌ఎమ్ మోహన్ రాజాతో కలసి పర్యవేక్షించారు. ఆయా స్టేషన్లలోని సమస్యలను ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు.. డిఆర్‌ఎమ్‌కు వివరించారు. సమస్యలను పరిష్కరించి పల్నాడు ప్రజలకు మేలు చేకూర్చాలని కోరారు. ఆయా ప్రాంతాల్లోని సమస్యలను నాయకులు, ప్రజలు ఎంపీకి వివరించారు. ఆర్‌యుబి, ఆర్‌ఓబిల అభివృద్ధి గురించి ప్రస్తావించారు. ఈనెల 15వ తేదీ నుండి రైతులకు వీలుగా కిసాన్ రైల్ ఏర్పాటవుతున్నట్లు ఎంపీ పేర్కొన్నారు. పిడుగురాళ్ల స్టేషన్లలో మౌలిక సదుపాయాలు మెరుగుపర్చాలని కోరారు. ప్లాట్‌ఫాం మొత్తం పైకప్పులు నిర్మించాలని కోరారు. ప్రయాణికులకు వారు ఎక్కాల్సిన బోగీలను తెలుసుకునేందుకు.. ఇండికేషన్ బోర్డులు త్వరగా ఏర్పాటు చేయాలని కోరారు. పార్కింగ్ స్థలాన్ని మరింత పెంచాలని కోరారు. పిడుగురాళ్ల స్టేషన్ నుండి బస్టాండ్‌కు కొత్త రోడ్డు నిర్మించాలని కోరారు. భావనగర్, నారాయణాద్రి, హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్, ఎంప్లాయిస్ ట్రైన్‌ను పిడుగురాళ్లలో ఆపేలా చూడాలని ప్రజలు ఎంపీకి తెలపగా, ఈ సమస్యను డిఆర్‌ఎమ్‌కు వివరించారు. జానపాడు గేట్‌ను పరిశీలించారు. ఇక్కడ ఆర్‌ఓబి ఇప్పటికే మంజూరయ్యిందని, త్వరలో ఏర్పాటు కాబోతుందని ఎంపీ వివరించారు. కేసాను పల్లి రైల్వే గేట్‌ను పరిశీలించారు. ఈ ప్రాంతంలో ఆర్‌యుబి ఏర్పాటు చేయాలని కోరారు. ఇక్కడి ఆర్‌యుబి మంజూరు అయ్యిందని, ఇది కూడా త్వరలో ఏర్పాటవుతున్నట్లు తెలిపారు. పల్నాడు ప్రాంతంలో ప్రధాన జంక్షన్. నడికుడి స్టేషన్‌ను పర్యవేక్షించారు. గతంలో ఉన్న రైల్వే పోలీస్ స్టేషన్‌ను.. మరలా నడికుడి జంక్షన్‌లో ఏర్పాటు చేయాలని, ప్రయాణికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు నాయకులు ఎంపీకి తెలిపారు. దీని గురించి ఎంపీ సంబంధిత అధికారులతో మాట్లాడారు. ఇక్కడ మరింత సెక్యూరిటీ సిబ్బందిని ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే మాచర్ల నుండి గుంటూరు ప్యాసింజర్‌కు ప్రస్తుతం ఉన్న 8బోగీలను 12బోగీలకు పెంచాలని కోరారు. ప్రధానంగా స్టేషన్లలో ఆగటం గురించి నాయకులు ఆడగగా.. ఎంపీ స్పందించి.. ఈ సమస్యను కూడా డిఆర్‌ఎమ్‌కు వివరించినట్లు తెలిపారు. రైల్లు ఆగాలంటే..ప్రయాణికులు సంఖ్య అధికంగా ఉండాలని, టిక్కెట్లు బుక్ చేసుకునే వారు ఎక్కువగా ఉండాలని డిఆర్‌ఎమ్‌కు గారు తెలిపినట్లు ఎంపీ వివరించారు. ఈ స్టేషన్లలో టికెట్ రిజర్వేషన్ల సంఖ్యను పెంచాలని, దీని ద్వారా ప్రయాణికులు ఆ్యధికమయ్యి, రైల్లు ఆగటానికి వీలుకల్గుతుందని ఎంపీ డిఆర్‌ఎమ్‌కు విన్నవించారు.

## మరో 39 మందికి కరోనా

**గుంటూరు, జనవరి 8 (ప్రజాపాలన) :** జిల్లాలో శుక్రవారం మరో 39 మందికి కరోనా నిర్ధారణైంది. దీంతో ఇప్పటి వరకు పాజిటివ్‌ల సంఖ్య 77,031కు చేరింది. మరోవైపు గురువారం ఉదయం నుంచి శుక్రవారం ఉదయం వరకు 43 మంది కోలుకున్నారు. ప్రాంతాల వారీగా పాజిటివ్‌లు : మేడికొండూరు 2, పెదనందిపాడు 2, సత్తెనపల్లి 1, తాడేపల్లి 5, చిలకలూరిపేట 1, నరసరావుపేట 2, యడ్లపాడు 2, తెనాలి 1, చుండూరు 1, గుంటూరు కార్పొరేషన్ 21 కాగా రాజీవ్ గాంధీ నగర్ 3, కొత్తపేట 2, రవీంద్ర నగర్ 2, మరో 15 ప్రాంతాల్లో ఒక్కో కేసు చొప్పున నమోదయ్యాయి.



# ప్రజాపాలన

సంపాదకీయం

శనివారం 9 జనవరి 2021


# దేవుడితో రాజకీయాలా?

రామతీర్థం కోదండ రామాలయంలో రాముని విగ్రహం శిరస్సు ఖండించిన దుర్ఘటనను అవకాశంగా తీసుకుని బిజెపి, టిడిపి, జనసేన మత రాజకీయాలు చేస్తున్నాయి. ప్రజలను రెచ్చగొట్టేందుకు బిజెపి, టిడిపి తెగ తాపత్రయ పడుతున్నాయి. నరేంద్ర మోడీ, అమిత్ షా లను తెప్పిస్తామని ప్రచారం చేస్తున్నారు. ఇదిలా ఉండగా మొన్న విజయవాడ ఆర్టీసి బస్‌స్టాండు వద్దే సీతమ్మవారి విగ్రహం అపభ్రంశం అయ్యింది. నిన్న సింగరాయకొండలో నరసింహస్వామి విగ్రహానికి అపచారం జరిగిందని మరో వార్త.

**ఎందుకు? ఎవరు చేస్తున్నారు?**

రాష్ట్రంలో గత ఆరు నెలలుగా వరుసగా దేవాలయాలపై దాడులు జరుగుతున్నాయి. ఎవరు? ఎందుకోసం చేస్తున్నారనే ప్రశ్న ఉదయిస్తుంది. తన వైఫల్యాలు కప్పిపెట్టుకోడానికి అధికార పార్టీ వైసిపి యే దేవాలయాలపై దాడులు చేస్తున్నదని ప్రతిపక్షం ఆరోపిస్తున్నది. ప్రజానుకూల పథకాలతో బలం పెరుగుతున్న అధికార పార్టీని ఎదుర్కోలేక ప్రతిపక్షమైన టిడిపి యే దేవునిపై దాడులు చేసి ఆ పాపం మాపై నెట్టే నీచమైన పనికి దిగిందని పాలక పార్టీ ప్రత్యారోపణలు చేస్తున్నది. రాష్ట్ర ముఖ్యమంత్రి క్రిస్టియన్ గనుక హిందూ దేవాలయాలు, దేవుళ్లపై దాడులు చేస్తున్నారని బిజెపి ఆరోపణ చేస్తున్నది.

**దేవుడే దిక్కుగా భావిస్తున్న పార్టీలు**

మనిషి తనకు అలవికాని ఆపద వచ్చినపుడు దేవుడిపై భారం వేసి ప్రశాంతత పొందుతాడు. ప్రజల ప్రయోజనాలను కాపాడలేని రాజకీయ పార్టీలూ దేవుడే దిక్కుగా చూస్తున్నాయి. ఇపుడు జరుగుతున్నది అదే. నిరుద్యోగం గతమేనాడూ లేనంతగా పెరిగిపోయింది. ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ఆకలితో మన దేశానిదే ప్రపంచంలో అగ్రస్థానం. పౌర హక్కులు, ప్రజాస్వామిక హక్కులు హరించి వేయడంలో మనదే ప్రపంచ రికార్డు. తారాపథంలో అంబానీ, అదానీలు...పాతాళంలో భారత ప్రజల బతుకులున్నాయి. పెల్లుబుకుతున్న ప్రజా వ్యతిరేకత, అసంతృప్తిని పక్కదారి పట్టించ డానికి బిజెపి కి దేవుడే దిక్కయ్యాడు. ప్రజల్లో దేవుడి ఆధారంగా భావోద్వేగాలతో రాజకీయంగా లబ్ధి పొందాలన్న కుట్ర ఇందులో ఇమిడి ఉంది.

**ప్రశాంత రాష్ట్రంలో మతోన్మాద చిచ్చు**

రాష్ట్రంలో లెక్కలేనన్ని దేవాలయాలు ఉన్నాయి. ఊరికి ఒకటి రెండు కాదు. వీధి వీధికి ఉన్నాయి. ప్రతి ఊళ్లోనూ చర్చిలు ఉన్నాయి. దారి పొడవునా ప్రతి మలుపులో ఆంజనేయ విగ్రహం ఉంది. ఆర్‌ఎస్‌ఎస్, విశ్వ హిందూ పరిషత్ అదే పనిగా విగ్రహాలు పెట్టించే పనిలో ఉన్నాయి. అక్కడక్కడా మసీదులు ఉన్నాయి. ప్రజలు ఎవరి నమ్మకాన్ని బట్టి వారు ప్రార్థనలు చేసుకుంటున్నారు. ప్రజలు ఒకరి జోలికి ఒకరు వెళ్ళడం లేదు. దేవుడు, మతం పేరున అల్లర్లు, దాడులు, దౌర్జన్యాలు లేవు. రాష్ట్రం ప్రశాంతంగా ఉంది. ప్రజలు ఐక్యంగా ఉంటే తమ రాజకీయాలకు తావుండదని ప్రజల మధ్య మతపరమైన విభజన తీసుకొచ్చే శక్తుల కుట్ర ఇందులో ఉందేమో విజ్ఞులైన ప్రజలు ఆలోచించాలి. విగ్రహాల విధ్వంసం ఉద్దేశపూర్వకంగా, పటిష్టమైన పథకం ప్రకారం జరుపుతున్నారు. లేకుంటే ఇన్ని వరుస ఘటనలు జరగవు. లేదా ఉన్మాదం తలకెక్కిన గుంపైనా చేసి వుండాలి.

**ప్రజా వ్యతిరేకతను పక్కదారి పట్టించే కుట్ర**

రైతు ప్రజలకు తిండి పెడతాడు. కార్మికుడు ప్రజలకు అవసరమైన సమస్త సరుకులు ఉత్పత్తి చేస్తాడు. కార్మికులను దేశ విదేశీ బడా వ్యాపార సంస్థలకు బానిసలుగా చేసే లేబర్ కోడ్ లను మోడీ ప్రభుత్వం చేసింది. అందువలన బిజెపి ప్రభుత్వం పట్ల కార్మిక వర్గం కోపంగా ఉంది. మరో వైపు రైతును కార్పొరేట్లకు బలి చేసే వ్యవసాయ చట్టాలు మోడీ ప్రభుత్వం చేసింది. బిజెపి ప్రభుత్వం చేసిన చట్టాలు రద్దు చేయాలని రైతులు ఢిల్లీని ముట్టడించి ఉన్నారు. మోడీ చేసిన ప్రతి ప్రజా వ్యతిరేక చట్టానికి జగన్, చంద్రబాబు ఇద్దరూ మద్దతు ఇస్తున్నారు. ఢిల్లీలో జరుగుతున్న రైతన్నల పోరాటం మన రాష్ట్రంలో రైతులను, ప్రజలను ఆలోచింపచేస్తున్నది. రైతులు అటువైపు ఆలోచిస్తున్న కొద్దీ ఈ మూడు పార్టీలు చేసిన ద్రోహం రైతులు, ప్రజలు గ్రహించగలుగుతారు. ఈ మూడు పార్టీల అంబానీ, అదానీల సేవ కూడా ప్రజలకు అర్థమైపోతుంది. ప్రజలను అటు వైపు చూడకుండా, ఆలోచించకుండా చేసేందుకు ఇలా గుళ్లు, దేవుళ్ల చుట్టూ అల్లర్లు జరుగుతున్నాయేమో పరిశీలించాలి.

**రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యం**

రాష్ట్ర ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరించడం లేదు. అశోక్ గజపతి రాజు పట్ల దేవాదాయ శాఖ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్ వాడిన భాష సమస్యను రెచ్చగొట్టే విధంగా వుంది. బాధ్యతాయుత స్థానాల్లో ఉండేవారు సమస్యను జటిలం చేయరాదు. ఇన్ని దుశ్చర్యలు జరిగినా ఇంత వరకు ఒక్క నేరస్తుడునీ రాష్ట్ర ప్రభుత్వం పట్టుకోలేదు. రాష్ట్రంలో నేరాలను నిరోధించడంలో ఘోరంగా విఫలమయ్యింది. మతోన్మాదుల ఆగడాలను అరికట్టడం లేదు. రాముడి విగ్రహాన్ని కాపాడలేనందుకు పూసపాటి అశోక్ గజపతి రాజును రామతీర్థం ట్రస్టు చైర్మన్ పదవి నుండి తొలిస్తున్నట్లు జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం జి.ఓ ఇచ్చింది. రాష్ట్రంలో దేవాలయాలపై దాడులు జరిగిన ప్రతి చోటా ఇలాగే వాటి చైర్మన్లను తొలగిస్తారా? రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి బాధ్యత వహించదా? దురుద్దేశాలతో రాజకీయ నిర్ణయాలు తీసుకోవడం సమస్యను పరిష్కారం చేయదు. జటిలం చేస్తుందని జగన్ ప్రభుత్వం గుర్తించడం మంచిది.

సిఐడి ని నమ్మరట.. సిబిఐ ని నమ్మాలట..

రామతీర్థం ఘటనపై దర్యాప్తు రాష్ట్ర ప్రభుత్వం సిఐడి కి అప్పచెబుతానంటున్నది. మేం సిఐడి ని నమ్మం. సిబిఐ కి అప్పజెప్పమని బిజెపి డిమాండ్ చేస్తున్నది. అంతర్వేది ఘటనపై బిజెపి డిమాండ్ మేరకు జగన్ ప్రభుత్వం సిబిఐ కి అప్పజెప్పింది. ఇంత వరకు దర్యాప్తు ప్రారంభించనే లేదు. పైగా సిబిఐ ని ఎందుకు నమ్మాలి? అది కేంద్రం చేతిలో పావు అని ఎవరికి తెలియదు? అందువలన సిట్ దర్యాప్తునకు ఆదేశించడం ఉత్తమం.

**బిజెపి ముందు టిడిపి నిలబడలేదు**

రాష్ట్రం హక్కులు కేంద్రం కాజేస్తున్నది. రాష్ట్ర ప్రయోజనాలకు జరిగే నష్టంపై స్పందించని బాబు రామతీర్థం విచ్చేసి రాముడిపై రాజకీయాలు చేయడం అనుచితం. చంద్రబాబుకు దేవుడి రాజకీయాలు సహకరించవని గుర్తించడం మంచిది. పావం చంద్రశేఖరరావు ఎన్ని యాగాలు చేసినా బిజెపి మతోన్మాదం ముందు పని చేయలేదు. మతోన్మాదం ఎజెండా బిజెపిది. ఎంత కష్టపడ్డా బిజెపి అంత ఉన్మాదం చంద్రబాబు రెచ్చగొట్టలేరు. పుట్టిన దగ్గర నుండి బిజెపి పని మతోన్మాదం రెచ్చగొట్టుడే. దానితో కలిసి చేసినా, విడిగా చేసినా బిజెపి కే లాభం. బిజెపితో రాజీ పడ్డవాళ్లంతా మట్టికొట్టుకుపోయిన అనుభవం కళ్ళెదుటే ఉంది. కేంద్రం పెత్తనానికి వ్యతిరేకంగా ఆవిర్భవించిన టిడిపి కి నేటి ఈ దుర్గతి విచారకరం.

**గోతికాడ నక్కలా బిజెపి**

వైసిపి, టిడిపి కీచులాట గోతికాడ నక్కలా కాచుక్కూర్చున్న బిజెపి ఉపయోగించుకుంటున్నది. దేశాన్ని, దేశ సంపదను, పరిశ్రమలు, బ్యాంకులు, ఇన్సూరెన్స్, రైల్వే, విద్య, వైద్యం, వ్యవసాయం, మార్కెట్ సర్వం బడా వ్యాపారులకు, విదేశీ కార్పొరేట్ కంపెనీలకు ఇచ్చేయడం, దేముడూ రాముడూ అంటూ జనానికి ఉన్మాదం ఎక్కించడమే సంఘ్ పరివారం పని. అవకాశం దొరికినప్పుడల్లా ఇతర మతాల పట్ల ద్వేషం రెచ్చగొట్టడమే పనిగా పెట్టుకున్నది. వాళ్ళ పుట్టుకే అది. చేగువేరా ఫోజులిచ్చి, అంబేద్కర్ సిద్ధాంతం చెప్పి బిజెపి ఉచ్చులో పడ్డ పవన్ కళ్యాణ్ దాంతో చేరడం అవకాశవాదానికి పరాకాష్ట. జగన్, చంద్రబాబు, పవన్ కళ్యాణ్ దేశానికి పట్టిన మతోన్మాద చీడను గుర్తించడం లేదు. రాజ్యాంగ వ్యతిరేక మనువాద పార్టీ బిజెపి ముప్పు గమనించడం లేదు.

**రాష్ట్రానికి బిజెపి ద్రోహం**

జెపి కేంద్ర ప్రభుత్వం దేశాన్ని నిండా ముంచేయడమే గాక మన రాష్ట్రానికి ప్రత్యేక హోదా, వెనకబడ్డ రాయలసీమ, ఉత్తరాంధ్రల అభివృద్ధికి ఆర్థిక ప్యాకేజీ, విశాఖ రైల్వే జోన్, కడప స్టీల్‌ప్లాంట్, రామాయపట్నం పోర్టు ఇవ్వలేదు. విభజన చట్టాన్ని అమలు చేయలేదు. జాతీయ ప్రాజెక్టు పోలవరంలో 3 లక్షల మంది ప్రజలకు రూ.33 వేల కోట్ల పునరావాస ప్యాకేజీని ఎగ్గొట్టింది. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ పోస్కో విదేశీ కంపెనీకి ఇచ్చివేసే నిర్ణయం చేసింది. అన్ని విధాలా మన రాష్ట్రానికి తీరని ద్రోహం చేసిన బిజెపి తను చేసిన పాపాల నుండి జనం దృష్టి మళ్లించేందుకు...ఇటువంటి ఘటనలతో ప్రజలను ఉన్మత్తులను చేసి తద్వారా రాష్ట్రంలో బలపడేందుకు...దేవుడిపై రాజకీయాలు చేస్తున్నది.

**మత రాజకీయాలను తిప్పికొట్టాలి**

ఆర్‌ఎస్‌ఎస్ రాజకీయ విభాగమే బిజెపి. దాని అనుబంధ సంస్థలు విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ వంటి శక్తులు భారత రాజ్యాంగాన్ని అంగీకరించలేదు. మత రాజ్యమే దాని లక్ష్యం. మతోన్మాదం అందుకు మార్గం. ఆంధ్రప్రదేశ్‌లో బిజెపి మతోన్మాదం రెచ్చగొట్టడానకే కంకణం కట్టుకున్నది. కనుక ఇలాంటి ఘటనను సృష్టించడం. తరువాత అల్లరి చేయడం బిజెపి అనుబంధ మూకలకు అలవాటే. అప్రమత్తంగా లేకుంటే రాష్ట్రాన్ని రావణ కాష్టం చేస్తారు. పాలక పార్టీ, ప్రధాన ప్రతిపక్షం తమ స్వంత ప్రయోజనాల కోసం మన రాష్ట్ర ప్రయోజనాలపై బిజెపితో రాజీ పడుతున్నాయి. అందువలనే రాష్ట్రంలో మతోన్మాదం పెరిగేందుకు తావిస్తున్నాయి. ప్రజలే విజ్ఞతతో ఆలోచించి మన దేశ లౌకిక రాజ్యాంగానికి, ఫెడరల్ రాజ్య వ్యవస్థకు పెను ముప్పుగా దాపురించిన బిజెపి మతోన్మాదాన్ని ఎండగట్టి రాష్ట్రంలో మత సామరస్యం కాపాడుకోవాలి. లేదంటే రాష్ట్రం అల్లకల్లోలమై అంధకారంలో చిక్కుకుంటుంది.

# భారతీయ ఆధునిక విజ్ఞాన వైతాళికులు

నాటి పాతరాతి యుగం నుంచి నేటి నానో డిజిటల్ యుగం వరకు విశ్వ మానవాళి నాగరికత వికాసానికి వైజ్ఞానికశాస్త్ర విప్లవాత్మక ప్రగతి ఎంతగానో దోహదపడింది. వైజ్ఞానికశాస్త్రం వెల్లడించిన ప్రక్రియలను సాంకేతికశాస్త్రం అందిపుచ్చుకొని మానవ జీవనశైలిని సులభతరం చేస్తూ వస్తున్నది. నేటి ఆధునిక మానవుడు శాస్త్రసాంకేతికతతో విడదీయరాని సంబంధాన్ని పెనవేసుకొని ఉన్నాడు. శాస్త్రసాంకేతికతను వదిలి క్షణం కూడా గడపలేని స్మార్ట్ డిజిటల్ వలయంలో చిక్కుకున్నాడు. సాంకేతికశాస్త్రం అనేది కనబడే సుందర భవనం అయితే దానికి మూలాధారమైన కనిపించని పటిష్ట పుణాది వైజ్ఞానికశాస్త్రమే అని మరువరాదు. ఆధునిక వైజ్ఞానికశాస్త్ర పురోగతికి పునాదులు వేసిన భారతీయ మహామహులు ఎందరో తమ జీవితాలను సర్వం అంకితం చేసి అంతర్జాతీయ స్థాయి ఆవిష్కరణలతో గుర్తింపు పొందారు. భారతీయ వైజ్ఞానికశాస్త్ర పరిశోధకులలో అపార ఖ్యాతిని గడించిన వారిలో కొందరు వైతాళికులను గుర్తు చేసుకోవాల్సిన అవసరముంది.



**సర్ ప్రఫుల్ల చంద్ర రాయ్:**

'భారతీయ రసాయనశాస్త్ర పితామహుడి'గా పేరుగాంచిన ప్రఫుల్ల చంద్ర రాయ్ లేదా పి సి రారు (2 ఆగష్టు 1861 - 16 జూన్ 1944) బెంగాలీ కెమిస్ట్, విద్యావేత్త, పారిశ్రామికవేత్త, అధ్యాపకుడు దాతృత్వ శీలిగా గుర్తింపు పొందారు. ప్రథమ ఆధునిక రసాయన పరిశోధనాలయాన్ని ఏర్పాటు చేసిన ఘనత పిసి రాయ్‌కే దక్కుతుంది. కలకత్తా యూనివర్సిటీలో బి.ఏ. ఎడిన్‌బర్గ యూనివర్సిటీలో బి.యస్‌సి/డి. యస్‌సి. పూర్తి చేశారు. రసాయనశాస్త్ర చరిత్ర, మూలక రసాయన శాస్త్రం,కర్బన రసాయన శాస్త్రాలలో విలువైన పరిశోధనలు చేశారు. ప్రఫుల్ల చంద్రరాయ్ శిష్యులలో ప్రముఖమైన వారుగా సత్యేంద్రనాథ్ బోస్, మేఘనాథ్ సాహ, జ్ఞానేంద్రనాథ్ ముఖర్జీ, జ్ఞాన చంద్ర ఘోష్ తదితరులు ఉన్నారు. రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీ (ఆర్‌యస్‌సి) పురస్కారం అందుకున్నారు. దూరదృష్టి కలిగి 700 రూపాయల నగదుతో పిసి రాయ్ దేశంలో ప్రథమ ఫార్మా కంపెనీ 'బెంగాల్ కెమికల్స్ అండ్ ఫార్మస్యూటికల్స్'ను ప్రారంభించారు. 1896లో మెర్క్యురస్ నైట్రైట్‌ను కనుగొన్నారు ఆయన. తన 82వ ఏట అంటే 16 జూన్ 1944న తుది శ్వాస విడిచారు.

**జగదీశ్ చంద్ర బోస్:**

భారతీయ ప్రముఖ జీవశాస్త్ర, భౌతికశాస్త్ర, వృక్షశాస్త్ర పరిశోధకులైన జగదీశ్ చంద్ర బోస్ (30 నవంబర్ 1858 - 23 నవంబర్ 1937) రేడియో, మైక్రోవేవ్ ఆప్టిక్స్ అంశాలతో పాటు వృక్షశాస్త్రంలో విస్తత పరిశోధనలు చేశారు. సైన్స్ ఫిక్షన్ రచయితగా ఖ్యాతిగాంచిన జె సి బోస్‌ను 'రేడియో సైన్స్ పితామహుడి'గా అభివర్ణిస్తారు. క్రిస్కోగ్రాఫ్‌ను కనుగొన్న బోస్ పేరును చంద్రమండల బిలానికి పెట్టడంతో అతని ప్రతిభను అంతర్జాతీయ వైజ్ఞానికశాస్త్ర సమాజం గుర్తించినట్లు అయ్యింది. 'బోస్ ఇనిస్టిట్యూట్'ను స్థాపించి నేడు అత్యున్నత పరిశోధనాలయంగా మలచగలిగారు. బెంగాల్‌కు చెందిన జె సి బోస్ కలకత్తా, కేంబ్రిడ్జ్, లండన్‌లలో బి.ఏ., బి.యస్‌సి , డి. యస్‌సి పూర్తి చేశారు.

ప్రముఖ అంతర్జాతీయ పరిశోధకులు నోబెల్ బహుమతి గ్రహీత 'రాలీ'ని గురువుగా భావించిన బోస్ శిష్యగణంలో సత్యేంద్రనాథ్ బోస్, మేఘనాథ్ సాహ, పి సి మహవ్‌నోబిస్, సిసిర్ కుమార్ మిత్ర, దేబేంద్ర మోహన్ బోస్ లాంటి వారు అనేకులు ఉన్నారు. వృక్షాలు వేడి, చలి, కాంతి, శబ్దం, సంతోషం, బాధకు చలిస్తాయని రుజువు చేస్తూ, వాటికి ప్రాణం/భావోద్వేగాలు ఉంటాయని కనుగొన్నారు. జె సి బోస్ మేధస్సును గుర్తించిన అంతర్జాతీయ వైజ్ఞానిక సమాజం 'కంపానియన్ ఆఫ్ ఆర్డర్ ఆఫ్ ఇండియన్ ఎంపైర్', స్టార్ ఆఫ్ ఇండియా, ఫెల్లో ఆఫ్ రాయల్ సొసైటీ, నైట్‌వుడ్ లాంటి అత్యున్నత పురస్కారాలు అనేకం అందజేశారు.

**శ్రీనివాస రామానుజన్:**

ప్రపంచం మెచ్చిన గణితశాస్త్ర మేధావి శ్రీనివాస రామానుజన్ అయ్యంగార్ (22 డిసెంబర్ 1887 - 26 ఏప్రిల్ 1920) బాలమేధావిగా తన ప్రతిభను ఆవిష్కరిస్తూ, ప్రముఖ గణితశాస్త్ర నిపుణులను సైతం ఆశ్చర్య పరిచారు. గణితంలో పూర్తి విద్యను పొందనప్పటికీ గణిత విశ్లేషణ, సంఖ్య సిద్ధాంతం, అనంత శ్రేణులు, భిన్నాలు లాంటి అంశాల్లో అనేక సూత్రాలు ప్రతిపాదించారు.

కళాశాలలో చేరి గణితాన్ని అవపోసన పట్టి, ఇతర సబ్జెక్టులలో ఫెయిల్ కావడంతో డిగ్రీ పొందలేక పోయారు. వారి గణిత మేధస్సును, పరిశోధనలను గుర్తించిన కేంబ్రిడ్జ్ ట్రినిటీ కాలేజి వారు బి. ఏ. పట్టా ఇచ్చారు. యూకె కేంబ్రిడ్జ్ యూనివర్సిటీకి చెందిన గణితశాస్త్ర పరిశోధకులు జి. హెచ్. హార్డీ నేతత్వంలో పలు గణిత సూత్రాలు/సిద్ధాంతాలు ప్రతిపాదించారు. లండన్ రాయల్ సొసైటీ సభ్యత్వానికి కూడా ఎన్నికైనారు. శ్రీనివాస రామానుజన్ అనారోగ్యంతో ఇండియాకు తిరిగి వచ్చి 32వ ఏటనే తుదిశ్వాస విడిచారు.

**సత్యేంద్రనాథ్ బోస్:**

భారతీయ గణిత, భౌతికశాస్త్ర నిపుణులు, ప్రఖ్యాత పరిశోధకులు సత్యేంద్రనాథ్ బోస్ (01 జనవరి 1894 - 04 ఫిబ్రవరి 1974) థియరిటికల్ ఫిజిక్స్, క్వాంటం మెకానిక్స్‌లో నిష్ణాతులు. అల్‌ఫ్రెడ్ ఐన్‌స్టీన్‌తో కలిసి బోస్-ఐన్‌స్టీన్ స్టాటిస్టిక్స్ ప్రతిపాదన చేసి బోస్-ఐన్‌స్టీన్ కండెన్సేట్ సిద్ధాంత రూపకర్తలుగా వైజ్ఞానిక రంగంలో సుస్థిరస్థానం ఏర్పరుచుకున్నారు. ఫెలో ఆఫ్ రాయల్ సొసైటీతో పాటు భారత ప్రభుత్వ పద్మ విభూషణ్ ఆవార్డులు పొందారు. కలకత్తా ,ఢాకా యూనివర్సిటీల్లో ఉన్నత విద్యను పూర్తి చేసిన సత్యేంద్రనాథ్ బోస్‌కు జె సి బోస్, పి సి రారులు చక్కటి మార్గనిర్దేశం చేశారు. రాజ్యసభ సభ్యుడిగా (1952 - 60) సేవలందించిన సత్యేంద్రనాథ్ బోస్ పేరున బోస్ గ్యాస్, బోసాన్, ఐడియల్ బోస్, ఫోటాన్ గ్యాస్, ఈక్వేషన్ ఆఫ్ స్టేట్, బోస్-ఐన్‌స్టీన్ కొరిలేషన్, బోస్-ఐన్‌స్టీన్ డిస్ట్రిబ్యూషన్ లాంటి ఆవిష్కరణలు నిలిచాయి. వైజ్ఞానికశాస్త్రంలో ఫిజిక్స్, మాథ్స్, కెమిస్ట్రీ, బయాలజీ, మినరాలజీ, ఫిలాసఫీ, ఆర్ట్స్ మరియు సంగీత అంశాలలో పట్టు ఉన్న సత్యేంద్రనాథ్ అధ్యాపకుడిగా సేవలు అందించారు.

న్యూయార్క్ టైమ్స్ ప్రచురించిన వ్యాసంలో సత్యేంద్రనాథ్ బోస్‌ను 'ఫాదర్ ఆఫ్ గాడ్ పార్టికిల్'గా అభివర్ణించారు. 20వ శతాబ్దంలో ప్రఖ్యాత 10 ఆవిష్కరణల్లో బోస్ ప్రతిపాదనలు కూడా చోటు దక్కించుకున్నాయి.

**అసిమా చటర్జీ:**

భారతీయ కర్బనరసాయన శాస్త్రజ్ఞులలో కలకత్తాకు చెందిన అసిమా చటర్జీ (23 సెప్టెంబర్ 1917 - 22 నవంబర్ 2006) ముందు వరుసలో నిలుస్తారు. ఆర్గానిక్ కెమిస్ట్రీ, ఫైటో కెమిస్ట్రీ, అల్కలాయిడ్స్, ఔషధ మొక్కలు, యాంటీ-ఎలెప్టిక్ , యాంటీ-మలేరియల్ డ్రగ్స్ రంగాలలో విస్తత కషి చేశారు.

భారతీయ విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పొందిన ప్రథమ మహిళగా అసిమా చటర్జీ నిలిచారు. కలకత్తా విశ్వవిద్యాలయంలో ఉన్నత విద్య పూర్తి చేసిన అధ్యాపకురాలిగా కూడా సేవలందించారు. తన పరిశోధనల్లో ముఖ్యమైనవిగా సర్పాజిన్, ఇండోల్ ఆల్కలాయిడ్స్, క్వినోలిన్స్, బీటా-ఫినైల్ఇథనాల్అమైన్స్, కుమరిన్స్ అంశాలు నిలిచాయి. తన పరిశోధనా ఫలితాలు 400 వ్యాసాల రూపంలో ప్రముఖ జర్నల్స్‌లో ప్రచురితం అయ్యాయి. శాంతి స్వరూప్ భట్నాగర్, పద్మభూషణ్, సి. వి. రామన్, యస్. యస్. భట్నాగర్ ఆవార్డులు లాంటివి అనేక పొంది, రాజ్యసభ (1982 - 1990) సభ్యురాలిగా కూడా పని చేశారు.

**ఇ కె జానకీ అమ్మాల్ :**

ప్రఖ్యాత భారతీయ వక్షశాస్త్ర పరిశోధకురాలైన ఇదవలత్ కక్కట్ జానకీ అమ్మాల్ (04 నవంబర్ 1897 - 07 ఫిబ్రవరి 1984) మద్రాస్ యూనివర్సిటీ ఉన్నత విద్య నభ్యసించి, మిచిగాన్ యూనివర్సిటీ డాక్టరేట్ పొందారు. అమెరికాలో పరిశోధనలు చేసి పిహెచ్‌డి పట్టా పొందిన ప్రథమ భారతీయ మహిళగా చరిత్రలో నిలవడంతో పాటు మిచిగన్ యూనివర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్ (డియస్‌సి) పొందిన భారతీయ మహిళగా పేరొందారు.

వక్షశాస్త్రంలోని సైటోజెనెటిక్స్, ఫైటోజియోగ్రఫీ, ప్లాంట్ బ్రీడింగ్ విభాగాల్లో లోతైన పరిశోధనలు చేశారు. చెరుకు, వంకాయ మొక్కలపై విశేష కషి చేశారు. సి. డి. డార్లింగ్‌టన్‌తో కలిసి 'క్రోమోసోమ్ అట్లాస్ ఆఫ్ కల్టివేటెడ్ ప్లాంట్స్' అనే చక్కటి పుస్తకం రచించారు. కేరళ అడవుల్లోని ఔషధ మొక్కలు, ఎత్నోబోటనీలపై పరిశోధనలు చేశారు. భారత ప్రభుత్వం నుంచి 'పద్మశ్రీ' పురస్కారాన్ని (1977) పొందారు. భారతదేశానికి చెందిన రెండు నూతన గులాబీ జాతులకు జానకీ అమ్మాల్ పేరు పెట్టారు. ఇదీ ఆమె విశిష్టత.

భారతీయ సంస్కతి, వారసత్వాలను తరతరాలకు అందజేసే బృహత్ కార్యాలను భుజాన వేసుకొని మోస్తున్న మేధావులు అన్ని రంగాలలో అనేకులు ఉన్నారు. శతాబ్ద క్రితం కూడా మహిళలు తాము ఎంచుకున్న రంగంలో అత్యున్నత ప్రతిభను ప్రదర్శించి ప్రపంచ మేధావుల మన్ననలు పొందగలిగారు.

ఇలాంటి ఆదర్శమూర్తుల జీవితాలు, వారు సాధించిన విజయాలు, పరిశోధనా ఫలితాలు మానవాళికి ఎంతో ప్రయోజనకరంగా నిలిచాయి.

ఈ వైతాళికుల స్ఫూర్తితో వైజ్ఞానికశాస్త్రాల్లో భారత్ ముందుకు సాగుతుందని ఆశిద్దాం.

## కొత్త సంవత్సరం

కొత్త సంవత్సరం రావాలి
కొత్త జీవితాలను అందించాలి
కోరిన కోర్కెలు తీర్చాలి
నాయకుల బుద్ధిని మార్చాలి
మంచి పనులను చేయించాలి
విద్యా బుద్ధులను కల్పించాలి
భావి పౌరులను అందించాలి
భవిష్యత్తు అందంగా మార్చాలి
బంగారు భవితను ఇవ్వాలి
వర్షాలను సకాలంలో కురిపించాలి
అన్నదాతలను ఆదుకోవాలి
పసిడి పంటలను పండించాలి
అందరి కడుపులు నింపాలి
ఆకలి కేకలను అరికట్టాలి
అందరిలో నూతనోత్సహం నింపాలి
అందమైన ప్రకృతిని ఇవ్వాలి
అందరినీ ఆరోగ్యంగా ఉంచాలి
దేశ భద్రతను కాపాడగలగాలి
అందరిలో అపారమైన శక్తి నింపాలి
విశ్వమంతా ప్రశాంతంగా ఉంచాలి

**రచన యం.తారాసింగ్**
**జిల్లా:నాగర్ కర్నూల్**

# అనాథాశ్రమంలో అన్నదాన కార్యక్రమం



**రాజుపాలెం, ప్రజాపాలన :** రాజుపాలెం మండలం వీరమ్మ కాలనీలో దీనమ్మ అండ్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ నిర్వహిస్తున్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అనాధ పిల్లల వృద్ధుల ఆశ్రమంలో శుక్రవారం దేవరంపాడు దేవస్థానం వైస్ చైర్మన్ కేసరి శ్రీనివాసరెడ్డి జ్యోతి కుమారుడు రోహన్‌రెడ్డి, కుమార్తె రితికారెడ్డి పుట్టినరోజు సందర్భంగా పిల్లలు వృద్ధులు మధ్య కేక్ కట్ చేశారు అనంతరం వారి చేతుల మీదుగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఆశ్రమానికి నా వంతు సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో రాజుపాలెం యార్డ్ వైస్ చైర్మన్ పుణ్యాల రామిరెడ్డి వైసిపి సీనియర్ నాయకుడు ప్రతాప్ రెడ్డి ఆశ్రమ నిర్వాహకులు గరికపాటి శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

# రాజుపాలెంలో కొనసాగుతున్న ముగ్గుల పోటీలు



**రాజుపాలెం, ప్రజా పాలన :** వైస్సార్సీపీ నియోజకవర్గ నాయకులు అంబటి మురళి గారు నరసరావుపేట పార్లమెంటరీ మహిళా అధ్యక్షురాలు డాక్టర్ గీత హాసంతి నరసరావుపేట పార్లమెంటరీ గడప గడప ఇంచార్జ్ శ్రీ బాసు లింగారెడ్డి, రాజుపాలెం మండల వైసీపీ అధ్యక్షులు వేపూరి శ్రీనివాసరావు తోట లక్ష్మీనారాయణ పసుపులేటి వెంకటస్వామి పులివెందుల సాంబశివరావు రాజుపాలెం మండల జడ్పీటీసీ అభ్యర్థి శ్రీ దొంతిరెడ్డి సునీత శ్రీనివాస్ రెడ్డి రాజుపాలెం వైస్సార్సీపీ నాయకులు పాల్గొన్నారు.

# వాస్తవిక పరిస్థితులపై ప్రజలు జాగురూకతతో మెలగాలి

- సెక్యులర్ వాతావరణాన్ని ధ్వంశం చేసే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల పన్నాగాన్ని ఎండగట్టండి
- డాక్టరు యం . సురేష్ బాబు, రాష్ట్ర అధ్యక్షులు, ప్రజా సైన్సు వేదిక

రాష్ట్రంలో హిందూ దేవాలయాలలోని విగ్రహాలపై కొంత కాలంగా జరుగుతున్న దాడులు, విధ్వంసం ఒక పథకం ప్రకారం మత సామరస్యాన్ని, ప్రజాస్వామ్య, సెక్యులర్ వాతావరణాన్ని విధ్వంసం చేసి, సంకుచిత రాజకీయ ప్రయోజనాన్ని పొందడం కోసం మతోన్మాద శక్తులు చేస్తున్న నీచ ప్రయత్నం తప్ప వేరేమీ కాదు. ప్రజలను వాస్తవిక పరిస్థితుల నుండి దూరం చేసి, అనవసర విషయాలపట్ల ప్రాముఖ్యత సంతరించుకోవడం ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందనడానికి సంకేతం. దేశ రాజధానిలో గత రెండు నెలలుగా రైతులు చేస్తున్న పోరాటాలను ప్రక్కదోవ పట్టించి, వారి ఐక్యతను దెబ్బతీసే విధంగా కేంద్రం వ్యవహరిస్తోంది. ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేసి, నిత్యావసర సరకుల ధరలను పెంచి, గ్యాసు , పెట్రోలు డీజిల్ ధరలను అర్థం పర్థం లేకుండా పెరుగుతూ పోతున్నాయి. ఇన్పుట్ సబ్సిడీ లేదు , క్రాప్ లాస్ లేదు, రైతు భరోసా ఊసే లేదు. దేశంలో అతిపెద్ద రవాణా రైల్వే తొమ్మిది నెలలు గడుస్తున్న పట్టాలెక్కలేదు. బ్యాంకులను విలీనం చేసి, నోట్లరద్దు , జీఎస్టీ, బి ఎస్ ఎన్ ఎల్, ఎల్ ఐ సి లాంటి సంస్థలను నిర్వీర్యం చేసి ఎన్నో ప్రజాకంటక నిర్ణయాలు తీసుకున్న కేంద్ర ప్రభుత్వం. అలాగే నేనేమి తక్కువ కాదు అని ఆస్తి పన్ను పెంచి, అర్థం పర్థం లేని ఫిక్సడ్ రోడ్ సర్ఛార్జి, రైతు సంక్షేమం రైతు భరోసా కేంద్రాల ద్వారానే అని రైతులను నిండా ముంచింది. మరోవైపు పేద విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించడానికి పెట్టిన విద్యాదీవెన పథకాన్ని ఉపసంహరించుకొని విద్యార్థులను చదువుకు దూరంచేసింది. హో రాష్ట్రంలో దళితుల పై అగ్రవర్ణ దాడులు, లైంగిక దాడులు, హత్యలు, పరువు హత్యలు ఇన్ని జరుగుతున్న వీటిపై చర్యలకు ఉపక్రమించక, అనవసర చిల్లర గలాటలను ప్రాముఖ్యత నిస్తూ శాంతి భద్రతలకు విఘాతం కల్పిస్తున్నాయి. ఈ కుట్రలను ప్రజా సైన్సు వేదిక తీవ్రంగా ఖండిస్తోంది. ఈ విషయంలో వై.సి.పి. రాష్ట్ర ప్రభుత్వ ఉదాసీన వైఖరి కారణంగానూ, ప్రతిపక్ష టీడీపీ, బిజేపీ, జనసేన పార్టీల సంకుచిత వైఖరితో చేస్తున్న ప్రకటనలు, వ్యవహరిస్తున్న తీరు రాష్ట్రంలో ప్రజల ఐక్యతను, మత సామరస్యాన్ని భంగం కలిగించే విధంగా ఉంది. ఈ దుష్ట ప్రయత్నాలన్నీ వాస్తవ సమస్యలనుండి ప్రజల దృష్టిని మళ్లించడానికి చేస్తున్న కుట్రలివి. ముఖ్యంగా బీజేపీ కేంద్ర ప్రభుత్వం తెచ్చిన వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా నేడు దేశంలో జరుగుతున్న రైతుల మహోద్యమం నేపథ్యంలో ప్రజల ఐక్యతను విచ్ఛిన్నం చేసే ప్రయత్నం జరుగుతోంది. ఈ దుష్ట శక్తుల పన్నాగాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఐక్యతను కంటికి రెప్పలా కాపాడుకోవాలని ప్రజలను కోరుతున్నాము. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఈ దుష్ట శక్తులను తక్షణమే బట్టబయలు చేసి కఠినంగా శిక్షించాలని ప్రజా సైన్సు వేదిక డిమాండ్ చేస్తోంది

# స్థలాలతో పేదలకు పట్టాభిషేకం : ఎమ్మెల్యే

**ఆలమూరు, ప్రజాపాలన :** వైసిపి ప్రభుత్వ హయాంలో రాజకీయాలకు అతీతంగా ఇళ్లస్థలాలు మంజూరు చేసి, పంపిణీ చేయడం పేదలకు పట్టాభిషేకమని కొత్తపేట శాసనసభ్యులు, పబ్లిక్ అండర్ టేకింగ్ కమిటీ చైర్మన్ చిర్ల జగ్గిరెడ్డి కొనియాడారు. మండలంలోని చింతలూరులో లబ్ధిదారులకు ఆయన ఇళ్ల పట్టాలు కోలాహలంగా అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ అనర్హులు ఎలా ఉన్నా ఏ ఒక్క అర్హుడికి అన్యాయం జరగకూడదన్నారు. అందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి నవరత్నాలు పథకాల అమలులో భాగంగా ఈ పథకం అర్హులందరికీ అందజేస్తూ మహాయజ్ఞంలా తల పెట్టారన్నారు. ఇంతటి మంచి కార్యక్రమంలో తాను భాగస్వామి అయినందుకు ఆనందంగా ఉందని ఆయన అన్నారు. వైసీపీ సీనియర్ నేత నామాల శ్రీనివాస్, సొసైటీ చైర్మన్ గొడవర్తి రామకృష్ణ, తహశీల్దార్ జి.లక్ష్మీపతి, మండల పరిషత్ ఎఒ టీవీ సురేంద్రరెడ్డి, ఆర్ఐ జానకి రాఘవ, కార్యదర్శి శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.







# సత్తెనపల్లి రైల్వే స్టేషన్‌ను సందర్శించిన నరసరావుపేట ఎంపీ, గుంటూరు డిఆర్ఎం

**స్టేషన్లో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాల గురించి, ప్రయాణికుల సమస్యలను ఎంపీ డిఆర్ఎమ్ కు వివరించారు**

**ప్రయాణికులకు వీలుగా ప్లాట్ ఫామ్ మొత్తం రూఫింగ్ (పై కప్పు) ఏర్పాటు చేయాలని కోరారు.**

**సత్తెనపల్లి, ప్రజాపాలన :** సౌకర్యవంతంగా విశ్రాంత గదులను ఏర్పాటు చేయాలని కోరారు. ప్రయాణికులు ఎక్కవలసిన బోగీలను త్వరగా తెలుసుకునేందుకు.. ఇండికేషన్ బోర్డ్ లు ఏర్పాటు చేయాలని కోరారు. స్టేషన్లలో ఇండికేషన్ బోర్డ్ ల ఏర్పాటుకి ఇప్పటికే రూ.2.50కోట్లు మంజూరు అయ్యాయని ..ఇవి త్వరగా ఏర్పాటు అవుతాయని తెలిపారు. ఆర్ యుబిలు ఏర్పాటు చెయ్యాలని కోరారు. ప్రస్తుతం ఉన్న ఆర్ యుబిలతో ఇబ్బంది ఉన్న దృష్ట్యా.. పేరే చర్ల వద్ద కొత్తగా మోడల్ గా ఏర్పాటు చేసిన ఆర్ యుబిల మాదిరిగా..అనుపాలెం వద్ద నిర్మిస్తున్నట్లు చెప్పారు. ఇది విజయ వంతమై , ప్రజలకు వీలుగా ఉంటే.. వీటి రూపులోనే నిర్మించాలని కోరారు. ఆర్ఓబి ఇప్పటికీ మంజూరు అయ్యిందని.. కానీ వీటి నిర్మానానికి రూ.30కోట్లు ఖర్చు అవుతుండగా.. ఇందులో రూ. 15కోట్లు మున్సిపాలిటీ ఇవ్వాల్సి ఉన్నందున, దీని నిర్మాణం కొంత సమయం పడుతుందని తెలిపారు. రైతులకు వీలుగా కిసాన్ రైల్ ఏర్పాటు అవుతుందని ఎంపీ పేర్కొన్నారు. అలగే స్టేషన్ పరిధిలో మార్గం ఇబ్బంది ఉన్న దృష్ట్యా.. దానిని సందర్శించి.. సమస్య పరిష్కారం అయ్యేలా చొరవ చూపాలని డిఆర్ఎమ్ కు తెలిపారు.

# నరసరావుపేట పట్టణ బిజెపి ప్రధాన కార్యదర్శిగా తాడువాయి వెంకట సతీష్



**నరసరావుపేట, ప్రజాపాలన :** భారతీయ జనతాపార్టీ నరసరావుపేట పట్టణ ప్రధాన కార్యదర్శిగా తాడువాయి వెంకట సతీష్ నియామకం జరిగి నట్లు నరసరావుపేట బిజెపి పట్టణ అధ్యక్షుడు రంగిశెట్టి రామ కృష్ణ అన్నారు. శుక్రవారం మల్లమ్మ సెంటర్లోని బీజేపీ పట్టణ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు రంగిశెట్టి రామకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో భారతీయ జనతాపార్టీ నరసరావుపేట పట్టణ ప్రధాన కార్యదర్శి గా తాడువాయి వెంకట సతీష్‌ను నియమిస్తూ పార్టీ నాయకుల సమక్షంలో నియామక పత్రం ఇవ్వటం జరిగినది. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు రంగిశెట్టి రామ కృష్ణ మాట్లాడుతూ సామాజిక మార్పు కోసం, సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేసే తాడువాయి వెంకట సతీష్ ను పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శిగా నాయకులందరూ సూచించటం సంతోషకరమైన విషయమని, ఈ పరిణామం పట్టణంలో పార్టీ పటిష్టమవటానికి, వ్యాపార వర్గాలకు, సామాజిక అంశాల మీద పోరాటం చేసే వారికి పార్టీ చేరువవుతుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు.

భారతీయ జనతా పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి గా నియమితులైన తాడువాయి వెంకట సతీష్ మాట్లాడుతూ పార్టీ తన మీద ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని, ఈ పదవిని ఒక భాధ్యతగా భావించి పార్టీ కి విధేయుడుగా ఉంటూ పార్టీ అభివృద్ధికి, స్థానిక సమస్యల పరిష్కారానికి తన వంతు శాయశక్తులా కృషి చేస్తానని పార్టీ సిద్ధాంతాలను క్షేత్ర స్థాయిలో ప్రచా రం చేసి పార్టీ అభ్యున్నతికి కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీ సీనియర్ నాయకులు కాకుమాను వెంకట కోటేశ్వరరావు, ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి ఇత్తడి కిరణ్,నాగసరపు బాబు,అమ్మాజిలాని,తవ్వా మల్లికార్జున్, పసుపులేటి సుబ్బారావు,మిరియాల నాగప్రసాద్, బీజేపీ బాషా,కామినేని హనుమంతరావు, చల్లా కోటేశ్వర రావు, సిద్ధు అనంత బ్రహ్మాచారి, పీరాట్ల మల్లికార్జున్, శిఖినం అనిల్ ప్రభుదాస్ తదితరులు తాడువాయి వెంకట సతీష్ కి అభినందనలు తెలియచేశారు.

# అన్ని ఇస్తున్నామంటూ ఉన్నవి కూడా తీసేస్తున్న వైఎస్ఆర్ సిపి ప్రభుత్వం



**సత్తెనపల్లి, ప్రజాపాలన :** రెవెన్యూ డిపార్ట్మెంట్ లో మోసాలు జరుగుతున్నాయి అని సత్తెనపల్లి నియోజకవర్గ తెలుగుదేశం నాయకులు తెలిపారు..ఈరోజు హక్కుదారు పట్టా ఫాసు పుస్తకాలు ఇస్తున్నాము అని కల్లబొల్లి మాటలు చెప్తున్న ప్రభుత్వం అని వారు విమర్శించారు.సొంత ఇల్లు వున్నవారికి ఇంటిపట్టా ఇస్తున్నామని ఆర్భాటంగా గొప్పలు చెప్పుతున్నారని, ఆలాగే పాత హౌసింగ్ పెండింగ్ లో ఉన్న బిల్లులు ఇవ్వలేనివారు, కొత్త గృహాలు మంజూరు చేయలేనివారు అభివృద్ధి అంటూ గాలి కబుర్లు చెపుతూ, లక్షలాది రేషన్ కార్డులు, పెన్షన్లు తొలగించడమేనా? చిన్న చిన్న కారణాలతో తీసేసిన అర్హులైన అందరికీ రేషన్ కార్డులు ఇవ్వాలని పెన్షన్లు ఇవ్వాలని సత్తెనపల్లి నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ నాయకులు డాక్టర్ కోడెల శివప్రసాద్ గారి కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో డిమాండ్ చేశారు. పాల్గొన్న నాయకులు మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్లు సయ్యద్ పెద కరిముల్లా. పూజల వెంకట కోటయ్య. పట్టణ పార్టీ ప్రధాన కార్యదర్శి షేక్ మస్తాన్ వలి. ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి కమిటీ మాజీ చైర్మన్ కంబాల వెంకటేశ్వరరావు. నాయకులు గుర్రం వెంకటేశ్వర్లు. కేతావత్ పున్నయ్య నాయక్. యర్రా వెంకటేశ్వరరావు. రాంబో బుడే. పుట్టి హనుమంతరావు. పసుపులేటి లింగేశ్వరరావు. బండారు నాగరాజు. కొల్లు రామ మల్లేశ్వరరావు. సయ్యద్ సైదా. యక్కల సుబ్బారావు. వెంకటరాఘువ. నూరు బాషా జానుబాబు. శిఖ కొండలు తదితరులు పాల్గొన్నారు.

# కోవిడ్ పై డ్రై రన్





**కారంపూడి, ప్రజాపాలన :** ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కోవిడ్ 19 వ్యాక్సినేషన్ డ్రై రన్ కార్యక్రమం ను శుక్రవారం నిర్వహించుట జరిగింది ఈ ఏర్పాట్లలో భాగంగా మండల టాస్కోర్స్ కమిటీ చైర్మన్ మండల తహసీల్దార్ జె ప్రసాదరావు మండల పరిషత్ అభివృద్ధి అధికారి బి బాలూ నాయ క్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డి బాలకిషోర్ నాయక్ మరియు ఇతర మండల స్థాయి అధికారులు సిబ్బంది పాల్గొన్నారు కార్యక్రమం ఏర్పాట్ల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు త్వరలో జరగబోయే కోవిడ్ వేక్సిన్ పంపిణీ అయిన వన్ , టు , త్రీ కార్యక్రమ ఏర్పాట్ల గురించి అధికారులు చర్చించడం జరిగిందని డాక్టర్ డి బాలకిషోర్ నాయక్ తెలిపారు. అదే విధంగా గాదెవారిపల్లె పిహెచ్ సి పరిధిలో కూడా డ్రెరన్ కార్య క్రమమును నిర్వహించుట జరిగిందని వైద్యాధికారి ఆర్ ఆంజనేయులు నాయక్ తెలిపారు. ఈ కార్యక్రమములలో సిహె చ్ ఒ రామాంజనేయులు, హెచ్ఎస్ డి పఠాభి, ఆరోగ్య మిత్ర శ్రీను, డిఇఒ టి వెంకట్రావ్, ఎఎన్ యంలు, సచివాలయ సిబ్బంది, పోలీస్ శాఖ, అశా , అంగన్ వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గోన్నారు

# నూతన భవనానికి శంకుస్థాపన చేసిన వైసీపీ నాయకులు



**కారంపూడి, ప్రజాపాలన :** పట్టణంలోని స్థానిక బ్రహ్మనాయుడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాఠశాల విద్యాకమిటి చెర్మన్ సయ్యద్. సాజన్ ఆధ్వర్యంలో 'జగనన్న"ప్రవేశపెట్టిన" నాడు నేడు కార్యక్రమంలో భాగంగా నూతన తరగతి గదుల శంకుస్థాపన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా షేక్. ఆరిఫ్ (వైస్సార్సీపీ జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి), బత్తుల. బైరాగి (కారంపూడి మండల బి సి నాయకులు) పాఠశాల ప్రధానోపాధ్యాయులు మరియు కాంట్రాక్టర్ మధుసూధనరెడ్డి మరియు పాఠశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొనడం జరిగింది.

# నేటి యువత ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ





**నకరికల్లు, ప్రజాపాలన :** నకరికల్లు లోనేటి యువత ఆధ్వర్యంలో నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నకరికల్లు పంచాయతీ సెక్రెటరీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జవాజి వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ ఈరోజు నిరుపేద లకు మా నేటి యువత తరపున దుప్పట్ల పంపిణీ కార్యక్రమం చేయుటం చాలా ఆనందంగా ఉంది గతంలో కూడా మా నేటి యువత తరుపున ఎన్నో సేవా కార్యక్రమాలు చేయడం జరిగింది మా గ్రూపు తరఫున మాకు చేతనైన సహాయం చేయుటకు కృషి చేస్తామని అన్నారు ఈ గ్రూపు క్రియేట్ చేసిన నాగూర్ ఈ సేవా కార్యక్రమాలకు రూపకల్పన చేయడం మేము అడిగిన వెంటనే స హృదయులైన దాతలు ముందుకు వచ్చి ఈ కార్యక్రమాలకు వారి వంతు సహాయం అందించడం వారి మంచితనానికి నిదర్శనం అని ఆయన అన్నారు అదేవిధంగా కోటపాటి వీరాంజనేయులు మాట్లాడుతూ నేటి యువత ఆధ్వర్యంలో ఇలాంటి సేవా కార్యక్రమాలు చేయటం మాకు చాలా ఆనందంగా ఉందని ఇలాంటి సేవా కార్యక్రమాలు రానున్న రోజుల్లో ఇంకెన్నో చేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో షేక్ మౌలాలి, చెట్టు బుజ్జి ,శీను, చల్లా శీను ,సయ్యద్ జిలాని, ఉదయం మణి, వెంకయ్య, నాగూర్, యా మర్తి రాము, పిట్ట మల్ల వెంకటరామయ్య, డాక్టర్ శివ నాగేశ్వరరావు ,బొక్క వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# అర్థం కానీ కేఈ ఫ్యూచర్..

**కర్నూలు, జనవరి 8 (ప్రజాపాలన) :** కర్నూలు జిల్లాలో టీడీపీకి కంచుకోట లాంటి నియోజకవర్గం పత్తికొండ. 1994 నుంచి గత ఎన్నికల వరకు టీడీపీ ఇక్కడ ఓటమి లేకుండా వరుస విజయాలు సాధించింది. అలాంటిది గత ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థి కె. శ్రీదేవిరెడ్డి భారీ మెజార్టీతో విజయం సాధించి టీడీపీ కంచుకోట బద్దలు కొట్టారు. 2009 పునర్విభజన తర్వాత పత్తికొండపై కన్నేసిన కేఈ కుటుంబం ఇక్కడ పాగా వేసింది. 2009 ఎన్నికల్లో కేఈ ప్రభాకర్ పోటీ చేసి విజయం సాధించారు. 2014 ఎన్నికల్లో ఏపీలో టీడీపీ అధికారంలోకి వస్తుందన్న అంచనాలతో ప్రభాకర్ తాను పోటీ నుంచి తప్పుకుని తన సోదరుడు కృష్ణమూర్తికి సీటు త్యాగం చేయడం, ఆయన విజయం సాధించడం జరిగాయి. ఆ తర్వాత ఆయన చంద్రబాబు కేబినెట్‌లో మంత్రిగాను, డిప్యూటీ సీఎంగాను వ్యవహరించారు. పేరుకు పెద్దాయనగా ఉన్నా ఆయన డిప్యూటీ సీఎం హోదాలో ఇమడ లేకపో యారన్నది అప్పటి పార్టీ, ప్రభుత్వ వర్గాల టాక్. ఇక గత ఎన్నికల్లో కృష్ణ మూర్తి పోటీ నుంచి తప్పుకుని తన సోదరుడు కేఈ. శ్యాంబాబుకు సీటు ఇప్పించుకున్నారు. అయితే శ్యాంబాబు తండ్రి రాజకీయ వారసత్వాన్ని కంటిన్యూ చేయలేక ఓటమి పాలయ్యారు. ఆయన ఓడిపోవడం ఒక ఎత్తు అయితే భారీ మెజార్టీతో తమ కంచుకోటను కోల్పోవడం మరో ఎదురు దెబ్బ. ఎన్నికల్లో ఓడిపోయినప్పటి నుంచి కేఈ కుటుంబం పత్తికొండతో అంటీముట్టనట్టుగా వ్యవహరిస్తోందన్న చర్చలు సొంత పార్టీ వర్గాల్లోనే వినిపిస్తున్నాయి. పార్టీ అధికారంలో ఉన్నప్పుడు తండ్రి మంత్రి, డిప్యూటీ సీఎంగా ఉండడంతో అన్నీ తానై చక్రం తిప్పిన శ్యాంబాబు కొంత దూకుడు గానే ముందుకు వెళ్లారు. ఈ క్రమంలోనే ప్రత్యర్థుల నుంచి విమర్శలు వచ్చినా గత ఎన్నికల్లో ఆయనే పోటీ చేశారు. ఎన్నికల్లో ఓటమి తర్వాత మాత్రం అటు తండ్రి, ఇటు తనయుడు ఇద్దరూ నియోజకవర్గంకు దూరంగా ఉంటోన్న పరిస్థితే కనిపిస్తోంది. శ్యాంబాబు ఎక్కువగా హైదరాబాద్‌కే పరిమితం అవుతూ స్థానికంగా పార్టీ కార్యక్రమాలు జరిగేలా ప్లాన్ చేస్తున్నారు. అయితే శ్యాంబాబు స్థానికంగా కేడర్‌కు అందుబాటులో లేకపోవడం పార్టీకి మైనస్ అవుతోంది. తోడు గత ఎన్నికలకు ముందే కోట్ల ఫ్యామిలీ టీడీపీలో చేరడంతో నియోజకవర్గంలో ఓ వర్గం సపరేట్ గ్రూప్ మెయింటైన్ చేస్తోన్న పరిస్థితి. ఇక కేఈ ఫ్యామిలీకి పట్టున్న మరో నియోజకవర్గం డోన్‌లో కూడా ఆ ఫ్యామిలీ గత రెండు ఎన్నికల్లోనూ ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి చేతిలో ఓడుతూ వస్తోంది. కృష్ణమూర్తి సోదరులు ఇద్దరూ డోన్‌లో గత రెండు ఎన్నికల్లో వరుసగా ఓడిపోయారు. ఈ క్రమంలోనే కేఈ ఫ్యామిలీ రాజకీయం బతికి బట్టకట్టా లంటే శ్యాంబాబు మరింతగా యాక్టివ్ అవ్వడంతో పాటు స్థానికంగా ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం కర్నూలు జిల్లా రాజకీయాల్లో టీడీపీ, వైసీపీ నుంచి పలువురు యువనేతలు దూసుకుపోతున్నారు. శ్యాంబాబు తన ఫ్యామిలీ రాజకీయ వారసత్వం నిలబెట్టడంతో పాటు రాజకీయంగా నిలదొక్కుకోవాలంటే మరింతగా శ్రమించక తప్పదు.

# పశ్చిమలో... కనిపించకుండా పోయారే..

**ఏలూరు, జనవరి 8, (ప్రజాపాలన) :** పశ్చిమగోదావరి జిల్లా ప్రజలు 2014 ఎన్నికల్లో స్వీప్ చేసి మరీ చంద్రబాబును అధికారంలోకి తీసుకువచ్చారు. పార్టీ అధికారంలో ఉన్న ఐదేళ్లలో అభివృద్ధి కంటే సొంత పార్టీ నేతల కుమ్ములాటలే ఎక్కువైపోయాయి. చివరకు టిక్కెట్ల వ్యవహారంలో ఒకరికి మరొకరు ఎర్త్ పెట్టుకున్నారు.

దీంతో విసుగె త్తిన పశ్చిమ ఓటరు టీడీపీకి రెండు సీట్లతో సరిపెట్టేశాడు. పాలకొల్లు, ఉండిలో మాత్రమే టీడీపీ విజయం సాధించింది. పార్టీ పవర్‌లో ఉన్నప్పుడు ఓ వెలుగు వెలగడంతో పాటు హీరోలుగా ఉన్న నేతల్లో కొందరి అడ్రస్ ప్రస్తుతానికి గల్లం తవ్వగా.. మరి కొందరు సరైన టైం కోసం వెయిటింగ్‌లో ఉన్నారు.

ముళ్లపూడి బాపిరాజు: టీడీపీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఎంతో దూకుడుగా ఉన్న ఆయన అధికారంలోకి వచ్చాక అంతకు మించిన దూకుడు చూపించడంతో పాటు గ్రూపు రాజకీయాలకు కేంద్రబిందువుగా మారిపోయారు. ముఖ్యంగా రిజర్వ్‌డ్ నియోజకవర్గాల్లో కొన్ని వర్గాలను ఎంకరేజ్ చేయడం ద్వారా ఎమ్మెల్యేలకు తలనొప్పిగా మారిపోయారన్న విమర్శలు తెచ్చుకున్నారు.

జడ్పీచైర్మన్‌గా ఆయనపై ఉన్న అంచనాలు అందుకోలేకపోయినా పవర్‌లో ఉన్నప్పుడు సపరేట్‌గా గ్రూప్ మెయిం టైన్ చేశారు. చివరకు 2019 ఎన్నికల్లో తాడేపల్లిగూడెం సీటు కోసం విశ్వప్రయత్నం చేసినా బాబు పట్టించుకోలేదు. ఎన్నికల్లో పార్టీ గెలుపుకోసం కొన్ని నియోజకవర్గాల నేతలకు ఆర్థికసాయం చేసినా అవి రాకపోవడంతో తీవ్ర నిరుత్సాహంతో బాపిరాజు రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు. ప్రస్తుతం ఆయన విజయవాడలోనే ఎక్కువుగా ఉండడంతో పార్టీ కేడర్‌కు ఆయనకు దూరం పెరిగిపోతోంది.. అటు టీడీపీ అధిష్టానం వద్ద కూడా పట్టు సడలుతోంది.

మాగంటి బాబు: టీడీపీ అధికారంలో ఉంటే మాగంటి హడావిడే వేరు. 2009 ఎన్నికల్లోనే టీడీపీ నుంచి ఎంపీగా ఓడిన బాబు 2014 ఎన్నికల్లో ఎట్టకేలకు ఎంపీగా ఐదేళ్లు పూర్తి చేసుకున్నారు. ఆయన పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో ఓసీ నేతలు ఉన్న చోట మినహా, మిగిలిన ఎస్సీ, బీసీ నేతలు ఉన్న నియోజకవర్గాల్లో గ్రూపు రాజకీయాలను ప్రోత్సహించి పార్టీని నాశనం చేయడంతో పాటు నేతలను ముప్పుతిప్పలు పెట్టారన్న విమర్శలు ఎదుర్కొన్నారు.

ఇక గత ఎన్నికలకు ముందు ఆయనకు టిక్కెట్ ఇవ్వాలా ? వద్దా ? అని చంద్రబాబు మీ మాంసలో పడినా చివరకు మాగంటి సీనియార్టీని గౌరవించి సీటు ఇస్తే చిత్తుగా ఓడిపోయారు. ఎన్నికల్లో ఓటమి తర్వాత మాగంటి రాజకీయాల్లో ఉన్నానా ? లేనా ?అన్నట్టుగా ఉన్నారు. ఆయన వారసుడు కూడా బయటకు రాకపోవడంతో మాగంటి ఫ్యామిలీ పొలిటికల్ ఫ్యూచర్‌పై పెద్ద సస్పెన్స్ ఉంది.

పీతల సుజాత: చింతలపూడి నుంచి గత టర్మ్‌లో రెండోసారి ఎమ్మెల్యే అయిన సుజాత మంత్రిగా మూడేళ్ల పాటు హవా కొనసాగించారు. సుజాత వ్యతిరేక కోటరీ చక్రం తిప్పడంతో ఆమె 2017లో మంత్రి పదవికి దూరమయ్యారు. చివరకు గత ఎన్నికల్లో ఆమెకు సీటు కూడా రాలేదు.

గత ఎన్నికల్లో చింతలపూడిలో ఓడిన కర్రా రాజారావు అనారోగ్యంతో ఉండడంతో మళ్లీ సుజాత వర్గం యాక్టివ్ అవుతోంది. టీడీపీ పదవుల్లో కూడా సరైన ప్రాధాన్యత లేదని అసంతృప్తితో ఉన్న సుజాత ప్రస్తుతం చింతలపూడి టీడీపీకి పెద్ద ఆప్షన్‌గా ఉన్నారు. మళ్లీ నియోజకవర్గ పగ్గాలు వస్తాయన్న ఆశతో సుజాత ఉన్నారు.

కలువపూడి శివ: పశ్చిమగోదావరి జిల్లాలో ఉండి నియోజకవర్గాన్ని టీడీపీకి కంచుకోటగా మార్చిన శివ వరుసగా రెండుసార్లు ఎమ్మెల్యే అయ్యారు. గత ఎన్నికల్లో చంద్రబాబు బలవంతంపై ఎంపీగా పోటీ చేసి ఓడిన శివ ఆ తర్వాత రాజకీయాల్లో ఉన్నారా ? అన్న సందేహాలు వచ్చే వైఖరితో ఉన్నారు. పదేళ్ల పాటు ఎమ్మెల్యేగా ప్రతి రోజు ఏదో ఒక సంచలనంతో వార్తల్లో ఉండే శివ ఎంపీగా పోటీ చేసి తాను తప్పు చేశానని.. చంద్రబాబు తన రాజకీయ భవిష్యత్తుపై దెబ్బ కొట్టారని మదన పడుతున్నారు. శివ మళ్లీ ఎప్పుడు యాక్టివ్ అవుతారో ? కూడా పార్టీ కేడర్‌కే తెలియడం లేదు.

మొడియం శ్రీనివాస్: 2012 ఉప ఎన్నికల్లో ఓడి 2014లో పోలవరం ఎమ్మెల్యేగా గెలిచిన మొడియం శ్రీనివాస్ గత ఐదేళ్లలో నియోజకవర్గంలో తీవ్ర వ్యతిరేకత మూటకట్టుకున్నారు. అప్పటి ఏలూరు ఎంపీ మాగంటి బాబుతో మొడియంకు ఏ మాత్రం పొసగలేదు. ఐదేళ్ల పాటు పోలవరంలో రెండు గ్రూపుల గోలే సాగింది. చివరకు గత ఎన్నికల్లో మొడియంకు సీటు రాలేదు. ఎన్నికల ప్రచారంలో కూడా అంటీముట్టనట్టుగా ఉన్న మొడియం ఇప్పుడిప్పుడే మళ్లీ యాక్టివ్ అవుతున్నారు. నియోజకవర్గంలో ఆయనకంటూ ఓ కేడర్ ఉన్నా వాళ్లను సమన్వయం చేసుకోవడంలో వెనకపడుతోన్న పరిస్థితి. ప్రస్తుత టీడీపీ ఇన్‌చార్జ్ బొరంగ శ్రీను స్ట్రాంగ్‌గా ఉండడంతో మొడియం భవిష్యత్తు ఏంటనేది చెప్పలేని పరిస్థితి.

# 15 రూపాయిలకు పడిపోయిన చికెన్

**న్యూఢిల్లీ, జనవరి 8 (ప్రజాపాలన) :** భారతదేశంలో బర్డ్ ఫ్లూ భయం పట్టుకుంది. ఇప్పటికే చాలా రాష్ట్రాల్లో చికెన్, కోడి గుడ్లు తినే వాళ్లే లేకుండా పోయారు. పలు రాష్ట్రాల్లో బర్డ్ ఫ్లూతో వేలాది కాకులు, బాతులు మృతి చెందడంతో పౌల్ట్రీ బిజినెస్ కూడా దెబ్బతింటోంది. చికెన్ తినొచ్చని వైద్యులు చెబుతున్నా చాలా ప్రాంతాల్లో ప్రజలు నమ్మడం లేదు. బర్డ్ ఫ్లూ విజృంభణ కారణంగా హర్యానాలోని జింద్ జిల్లా నుంచి ఢిల్లీకి కోళ్ల తరలింపుపై తీవ్ర ఇబ్బందులు ఎదురవుతూ ఉన్నాయి. ఢిల్లీలో కిలో కోడి మాంసం ఖరీదు రూ. 15కు పడిపోయింది. వాటి ధర ఒక్కసారిగా పడిపోవడంతో కోళ్ల వ్యాపారులు ప్రతిరోజూ సుమారు కోటీ 20 లక్షల రూపాయలు నష్టపోతున్నారు. జింద్ జిల్లాలో పౌల్ట్రీ పరిశ్రమకు మంచి పేరుంది. ఆ జిల్లాలో 500కు పైగా పౌల్ట్రీ ఫారాలు, 80కి పైగా హ్యాచరీలు ఉంటాయి. అక్కడి నుంచి ఢిల్లీకి విక్రయించే కోళ్ల బరువు సుమారు 8 లక్షల కిలోగ్రాములుంటుంది. చికెన్ ను బాగా ఉడికించి తినడం వల్ల నష్టమేమీ ఉండదని వైద్యులు



అంటున్నా కూడా ప్రజలే భయపడుతూ ఉండడంతో చికెన్ ధర మరింత తగ్గిపోయే అవకాశం ఉంది. విదేశాల నుంచి భారత్ వచ్చే వలస పక్షుల వల్లే బర్డ్ ఫ్లూ భారత దేశంలో మళ్లీ కనిపిస్తోందని కేంద్ర పశు సంవర్ధక, మత్స్యశాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ తెలిపారు. బర్డ్ ఫ్లూ కేసులు ప్రపంచం మొత్తం ఉన్నాయని, అయితే గత సెప్టెంబరులో భారత్ ను బర్డ్ ఫ్లూ రహిత దేశంగా ప్రకటించామని అన్నారు. శీతాకాలం నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలంటూ అక్టోబరులో రాష్ట్రాలకు సలహా ఇచ్చామని.. ఇప్పుడు భారత్ లో మళ్లీ బర్డ్ ఫ్లూ కేసులు వస్తుండడానికి కారణం విదేశాల నుంచి వచ్చే వలస పక్షులేనని తెలిపారు. దేశంలో వలస పక్షులకు ఆవాసంగా ఉండే ప్రాంతాల్లోనే బర్డ్ ఫ్లూ కేసులు అధికంగా వస్తున్నాయని తెలిపారు. ఇక గుంటూరు జిల్లాలో పలు కాకులు మృతి చెందడంతో స్థానికులు ఆందోళనకు గురవుతున్నారు. కొల్లిపర మండలం గుదిబండివారి పాలెం హైస్కూల్ వద్ద 6 కాకులు మృతి చెందాయి. ఒక్కసారే అన్ని కాకులు మరణించడంతో స్థానికులు ఆ విషయాన్ని వెటర్నరీ అధికారులకు తెలియజేశారు. స్థానిక వెటర్నరీ అధికారిణి శ్రీలక్ష్మి మాట్లాడుతూ, గత మూడ్రోజులుగా ఇక్కడ కాకులు మృత్యువాత పడుతున్నట్టు తమ దృష్టికి వచ్చిందని అన్నారు. బర్డ్ ఫ్లూ అనుమానంతో ఇక్కడి కోళ్లఫారాలను పరిశీలించామని, ఎక్కడా అనుమానించదగ్గ లక్షణాలు కనిపించలేదని స్పష్టం చేశారు.

# రోజుకు 13 లక్షల మందికి వ్యాక్సినేషన్

**న్యూఢిల్లీ, జనవరి 8, (ప్రజాపాలన) :** కోవిడ్-19 వాక్సినేషన్ తొలి దశలో రోజుకు 13 లక్షలమందికి టీకాలు వేయగలిగితే చాలా త్వరగా కోవిడ్ మహమ్మారి వ్యాప్తిని అరికట్టవచ్చని ఎస్బీఐ పరిశోధన నివేదించింది. భారత్‌కు చెందిన సీరమ్ ఇనిస్టిట్యూట్ రూపొందించిన కోవిషీల్డ్, భారత బయోటెక్ సంస్థ రూపొందించిన కోవాక్సిన్ టీకాలకు డ్రగ్ రెగ్యులేటర్ ఆమోదం తెలుపటంతో కేంద్ర ప్రభుత్వం వచ్చే వారం నుంచి దేశంలో కరోనా వ్యాక్సినేషన్ ప్రారంభించనుంది. ప్రభుత్వం ఈ ఆగస్టు నాటికి 30 కోట్లమందికి టీకాలు వేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. అయితే రోజుకు 13.27 లక్షల మందికి టీకాలు వేయగలిగితేనే కేంద్రం తన లక్ష్యాన్ని నెరవేర్చుకోగలదు. అయితే రోజుకు 15,645 మందికి టీకాలు వేస్తే చాలు వందశాతం టీకాలు వేయకున్నప్పటికీ కరోనా వ్యాప్తిని నియంత్రించవచ్చని ఎస్బీఐ తాజా పరిశోధన తెలిపింది. ఎస్బీఐ నివేదిక చెబుతున్న దాని ప్రకారం రోజుకు కనీసం 15,645 మందికి టీకాలు వేయగలిగితే వైరస్ వ్యాప్తి విషయంలో సమతుల్యత తేవచ్చని భారతీయ స్టేట్ బ్యాంకు తాజా పరిశోధన నివేదిక తెలిపింది. ప్రభుత్వం 13 లక్షలమందికి టీకాలు వేయాలని లక్ష్యంగా పెట్టుకుంది ఆ లెక్కన దేశం వ్యాధిరహిత స్థితికి చేరుకోగలుగుందని నివేదిక తెలిపింది. కేంద్రం చెబుతున్నట్లు రోజుకు దేశంలో 13 లక్షలకు పైగా టీకాలు వేయటం అటే అసాధ్యమైన పనిగా కనిపిస్తోంది. గతంలో భారత ప్రభుత్వం నాలుగు నెలలకాలంలో 12.5 కోట్ల జన్ ధన్ ఖాతాలను తెరవగలిగింది. అంటే రోజుకు 8 లక్షల ఖాతాలను తెరిచిందన్నమాట. దేశంలో ప్రస్తుతం సోకుతున్న అంటువ్యాధులు, మరణాల సంఖ్య ప్రాతిపదికన ఈ నివేదికను తయారు చేసారు. గత కొన్ని వారాలుగా దేశంలో కోవిడ్-10 ఇన్ఫెక్షన్లు, మరణాలు తగ్గుముఖం పడుతూ వస్తున్నాయి. గత కొన్నిరోజులుగా రోజువారీ కరోనా కేసులు దేశంలో 20 వేలలోపు నమోదవుతున్నాయి. బుధవారం 24 గంటల వ్యవధిలో 18,088 కొత్త కేసులు నమోదయ్యాయి. దేశవ్యాప్తంగా వ్యాక్సినేషన్ చేయాలంటే కేంద్ర ప్రభుత్వానికి తొలిదశలో 30కోట్ల మందికి గానూ, 21 వేల కోట్ల నుంచి 27 వేల కోట్ల వ్యయం కానుందని నివేదిక తెలిపింది. అదే రెండో దశలో అయితే 50 కోట్ల టీకాలకు 35 వేల కోట్లనుంచి 45 వేల కోట్లు ఖర్చవుతందని నివేదిక తెలిపింది. భారత్ బయోటెక్ ఇప్పటికే ఒక డోసుకు వంద రూపాయల కంటే తక్కువ ధర అవుతుందని, వాక్సినేషన్ ఖర్చును మరింత తగ్గించవచ్చని చెప్పింది.

# చక్రం తిప్పుతున్న విజయసాయిరెడ్డి

**విశాఖపట్టణం, జనవరి 8, (ప్రజా పాలన) :** రాజకీయాల్లో ఓర్పు, సహనంతో ఎదురుచూడాలి. పరిస్థితులు ప్రతికూలంగా ఉన్నప్పుడు సంయమనం వహించాలి. అప్పుడే తనదైన రోజున చక్రం తిప్పే అవకాశం వస్తుంది. ఇందుకు తాజా ఉదాహరణ వైసీపీలో విజయసాయిరెడ్డి. పార్టీ ప్రారంభం నుంచి నంబర్ టుగా ఉంటూ వచ్చిన విజయసాయిరెడ్డి ఏడాదికాలంగా ఒడుదొడుకులు ఎదుర్కొంటూ వస్తున్నారు. పార్టీ తరపున తొట్టతొలి రాజ్య సభ సభ్యునిగా, పార్లమెంటరీ పార్టీ నేతగా, ప్రదాన కార్యదర్శిగా బహుముఖ మైన పాత్ర అతనిది. అన్నిటికీ మించి జగన్ కు అత్యంత సన్నిహితుడు. సీఎం ముద్దాయిగా ఉన్న దాదాపు కేసులన్నిటిలోనూ తాను సైతం నిందితునిగా ఉన్నాడు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అత్యుత్సాహం, అతి చొరవ చూపడంతో పార్టీలో విజయసాయిరెడ్డికి ప్రతికూల వాతావరణం ఏర్పడింది తప్పనిసరి పరిస్థితుల్లో జగన్ కొంత దూరం పెట్టారు. పార్టీ బాధ్యతలను విభజించి విజయసాయిరెడ్డితో పాటు వై.వి.సుబ్బారెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డిలకు అప్పగించారు. ఉత్తరాంధ్రకే విజయసాయిని పరిమితం చేశారు. ఈ పరిణామం పార్టీలో ఆయన ప్రాబల్యాన్ని కుదించి వేసింది. కానీ



మళ్లీ గడచిన రెండు నెలలుగా పరిస్థితులు అనుకూలంగా మారాయి. తాజా పరిణామాలల్లో మళ్లీ విజయసాయిరెడ్డి శకం పార్టీలో ప్రారంభమైందని ప్రచారం మొదలైంది. వైసీపీలో విజయసాయి రెడ్డి వ్యూహకర్త. సామాజిక మాధ్యమాల్లో ప్రచారాన్ని హోరెత్తించినా, ప్రశాంత్ కిశోర్ తో కలిసి అభ్యర్థుల ఎంపికను వడపోసినా అంతా ఆయన చేతులమీదుగానే జరిగింది. జగన్ కు అత్యంత విశ్వాసపాత్రుడే కాకుండా , మీడియా సామ్రాజ్య నిర్మాణంలో విజయసాయిరెడ్డి పాత్ర తోసిపుచ్చలేనిది. సమీపబంధువుగా వై.వి.సుబ్బారెడ్డి, మీడియా నిర్వహణలో సజ్జల రామకృష్ణారెడ్డి కుడిఎడమ భుజాలుగా జగన్ కు నిలిచారు. అయినప్పటికీ ఆయనకు హార్ట్; ఆత్మ మాత్రం విజయసాయిరెడ్డినే. పార్టీ విజయం సాధించేవరకూ రాజకీయ వ్యవహారాలన్నీ ప్రధాన కార్యదర్శి హోదాలో నేరుగా ఆయన నిర్వహించేవారు. పాదయాత్రలో ఉన్న జగన్ పార్టీ పదవుల నియామక బాధ్యతలు సహా సంపూర్ణ పర్యవేక్షణను విజయసాయికి అప్పగించారు. పార్టీకి తొలి రాజ్యసభ సభ్యునిగా అవకాశం కల్పించారు. అధికారం రాగానే ఢిల్లీలో ప్రభుత్వ ప్రతినిధి బాధ్యతలు అప్పగించారు. అంతా బాగానే ఉంది. కానీ తన దూకుడే ఆయనకు బ్రేకులు వేసింది. బీజేపీని రాష్ట్రంలో డ్యామేజీ చేసే ప్రయత్నం చేశారని కమలం పార్టీ పెద్దలు ఆయనపై ఆగ్రహించారు. ప్రధానంగా కన్నా లక్ష్మీనారాయణ బీజేపీ రా ష్ట్ర శాఖ అధ్యక్షునిగా ఉన్న సమయంలో విజయసాయి చేసిన వ్యాఖ్యలు , తెలుగుదేశం రాజ్యసభ సభ్యులు బీజేపీలో చేరినప్పుడు ఆయన చేసిన ప్రవర్తించిన తీరు బీజేపీకి కొంత ఆగ్రహం కలిగించాయి. దీనిపై బీజేపీ పెద్దలు సున్నితంగా హెచ్చరించడంతో జగన్ అప్రమత్తమయ్యారు. విజయసాయిని ఉత్తరాంధ్రలోని మూడు జిల్లాల కే పరిమితం చేస్తూ కీలకమైన రాయలసీమ, కోస్తా బాధ్యతలను సజ్జల రామకృష్ణారెడ్డి, వై.వి. సుబ్బారెడ్డిలకు అప్పగించారు. పార్టీలో తన హవా తగ్గిన విషయం గ్రహించిన విజయసాయిరెడ్డి చాలా వ్యూహాత్మకంగా వ్యవహరిస్తూ వచ్చారు.

తనకు అప్పగించిన బాధ్యతను సమర్థంగా నిర్వహించడంతోపాటు బీజేపీ పెద్దలతోనూ తిరిగి సన్నిహిత సంబంధాలు నెలకొల్పుకున్నారు. సోము వీర్రాజు నూతన అధ్యక్షునిగా రావడంతోనే రాష్ట్ర బీజేపీతో విజయసాయిరెడ్డికి ఉన్న విభేదాలు తొలగిపోయాయి. అందులోనూ రాష్ట్ర ప్రభుత్వం తరఫున, జగన్ తరఫున కేంద్రంతో మాట్లాడే నైపుణ్యం కేవలం విజయసాయిరెడ్డికి మాత్రమే ఉంది. లోక్ సభా పక్షం నేత మిధున్ రెడ్డి జూనియర్ కావడం కూడా విజయసాయికి కలిసి వచ్చింది. ఉత్తరాంధ్రలో టీడీపీని చెల్లాచెదురు చేయడం, ఎమ్మెల్యేలను, నాయకులను పెద్ద ఎత్తున వైసీపీలో చేర్పించడం వంటి కార్యక్రమాలతో జగన్ ను నిరంతరం కలిసే ఏర్పాట్లు చేసుకున్నారు. ఇటీవల ప్రదానిని, హోంమంత్రిని కలిసిన సందర్భంలోనూ జగన్ తో కేవలం విజయసాయి మాత్రమే ఉండటం గమనార్హం.

తాజాగా స్థానిక ఎన్నికలు ఏప్రిల్, మే నెలల్లో ఉండబోతున్నాయనే కీలక ప్రకటనను ఆయనే చేశారు. జులై 8 నుంచి పార్టీ ప్లీనరీ ఉంటుందనీ చెప్పేశారు. పార్టీ విషయాల్లో ఆచితూచి వ్యవహరించే విజయసాయిరెడ్డి వీటన్నిటినీ జగన్ తో సంప్రతించిన తర్వాతనే ప్రకటించి ఉండవచ్చని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అంతేకాకుండా పార్టీకి బాధ్యత వహిస్తున్న ముగ్గురు నాయకులు సంయుక్తంగా చేయాల్సిన ప్లీనరీ ప్రకటనను విజయసాయిరెడ్డి తన సొంతం చేసుకోవడమంటే మళ్లీ నంబర్ టు స్థానం తనదేనని చాటిచెప్పడమే. నిజానికి విజయసాయిరెడ్డితో పార్టీకి చాలా అవసరాలున్నాయి. కేంద్రంతో సంబంధాలు, ఆర్థిక సర్దుబాట్లు, పారిశ్రామిక, వ్యాపార వర్గాలతో మంతనాలు వంటివన్నీ సమర్థంగా చేయగల నైపుణ్యం పార్టీలో అతనికి మాత్రమే ఉంది. పైపెచ్చు వాణిజ్య మంత్రిత్వ శాఖ స్టాండింగ్ కమిటీకి ఛైర్మన్ గానూ వ్యవహరిస్తున్నారు. మరోవైపు విజయసాయితో సమాన హోదాలో పార్టీకి బాధ్యులుగా నియమితులైన సజ్జల రామకృష్ణారెడ్డి, వై.వి.సుబ్బారెడ్డిలు స్థానికంగానే పరిమితమైపోయారు. టీడీపీకి దీటైన సమాధానం చెప్పడంలోనూ విజయసాయిరెడ్డి కనబరచిన చొరవను ఈ ఇద్దరు నాయకులు చూపలేకపోతున్నారనేది జగన్ సమీకరించుకున్న సమాచారం. వై.వి. సుబ్బారెడ్డి పూర్తిగా ఆధ్యాత్మిక కార్యక్రమాలకు , తన అనుచరులకు సంబంధించిన వ్యవహారాలకే సమయం కేటాయిస్తున్నారనేది ఫిర్యాదు. తనకు అప్పగించిన జిల్లాల విషయంలోనూ సమర్థంగా పాత్ర పోషించలేకపోతు న్నారంటున్నారు. గోదావరి జిల్లాల్లో ప్రబలుతున్న అంతర్గత విభేదాలను స్వయంగా జగన్ పరిష్కరించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. అదే విధంగా పార్టీ కేంద్ర కార్యాలయ బాధ్యతలను కూడా సజ్జలకు అప్పగించినా సమన్వయం కనిపించడం లేదని పార్టీ నాయకులే పేర్కొంటున్నారు. మొత్తమ్మీద వీరిద్దరి బలహీనతలు విజయసాయికి వరంగా మారాయి. ఆయనకు ముకుతాడు వేయాలని ఒకానొక దశలో జగన్ భావించినప్పటికీ తిరిగి స్వేచ్ఛను, తన తర్వాత అపరిమిత అధికారాలను కల్పించకతప్పని అనివార్యత ఏర్పడింది.

# నామ్ కే వాస్తేగా యూపీఏ

**న్యూఢిల్లీ, జనవరి 8, (ప్రజాపాలన) :** ప్రాంతీయ పార్టీలు అన్ని రాష్ట్రాల్లో ఆధిక్యతను కనపరుస్తున్నాయి. ఈ నేపథ్యంలో యూపీఏ అనేది వచ్చే ఎన్నికల్లో ఉంటుందా? లేదా? అన్నది పార్టీలోనే చర్చగా మారింది. ఇంతకు ముందు ప్రాంతీయ పార్టీలు కాంగ్రెస్ వైపు చూసేవి. ఇప్పుడు అదే జాతీయ పార్టీ అయిన కాంగ్రెస్ ఇప్పుడు ప్రాంతీయ పార్టీల మద్దతు కోసం ఎదురు చూపులు చూస్తుంది. యూపీఏ 1, యూపీఏ 2 దేశంలో అధికారంలోకి వచ్చింది. మన్మోహన్ సింగ్ పదేళ్ల పాటు ప్రధానమంత్రిగా ఉన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ తమ అధ్యక్షుడు ఎవరనే తేల్చుకునే పనిలోనే ఉంది. చివరకు రాహుల్ గాంధీని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిని చేస్తారు. దానికి ఎవరూ అభ్యంతరం చెప్పరు. కానీ ఇప్పుడు అన్ని పార్టీలనూ కలుపుకుని నడిపించగల యూపీఏ ఛైర్మన్ ఎవరనేది ఆసక్తికరంగా మారింది. ఇప్పటి వరకూ యూపీఏ ఛైర్ పర్సన్ గా ఉన్న సోనియా గాంధీ ఆరోగ్య కారణాలతో ఆ పదవిని చేపట్టలేరు. సోనియా ఆ పదవిలో ఉంటే కొంత ప్రాంతీయ పార్టీల్లోనూ సానుకూలత ఉండే అవకాశం ఉంది. కానీ రాహుల్ గాంధీ యూపీఏ ఛైర్మన్ అయితే మాత్రం ప్రాంతీయ పార్టీలు ఎక్కిదిగుతాయంటారు. ఆయన వయసు, రాజకీయ అనుభవమే ఇందుకు కారణం. దీంతో శరద్ పవార్ ను యూపీఏ ఛైర్మన్ ను చేయాలన్న ప్రతిపాదన వచ్చింది. దీనికి శరద్ పవార్ సుముఖంగా లేరు. లేకుంటే కాంగ్రెస్‌లోనే సీనియర్ నేతకు యూపీఏ ఛైర్మన్ గా నియమించాల్సి ఉంటుంది.

# ముప్పేట దాడిలో ప్రతిపక్షాలు

**విజయవాడ, జనవరి 8, (ప్రజాపాలన) :** అన్ని చుక్కలు ఒక వైపు, నిండు చందురుడు మరో వైపు అని ఒక టాలీవుడ్ స్టార్ సినిమాలో పాపులర్ సాంగ్ ఉంది. ఏపీ రాజకీయాల్లో ఇపుడు చూస్తే అదే కనిపిస్తోంది. జగన్ ఒక వైపు ఉంటే విపక్షాలు అన్నీ కూడా కుడి ఎడమల తేడా మరచి గుంపుగానే ఉంటున్నాయి. సీపీఐ నారాయణ అయినా బీజేపీ సోము వీర్రాజు అయినా జగన్ దగ్గరకు వచ్చేసరికి ఒకేలా సౌండ్ చేస్తున్నారు. జనసేనాని పవన్ అయినా, చంద్రబాబు అయినా కూడా జగన్ మీద బాణాలు వేయడంలో ముందుంటున్నారు. మరి ఇది విపక్షాల రాజకీయానికి ఏ మాత్రం మేలు చేస్తుంది అన్న చర్చ అయితే ఉంది.ఏపీలో జగన్ సెంటు జాగా మాత్రమే పేదలకు ఇస్తున్నారు అంటూ టీడీపీ భావి నేత లోకేష్ అంటున్నారు. జగన్ ఇంటి బాత్ రూం సాటి కూడా చేయని స్థలంలో ఇళ్ళు కట్టిస్తున్నారని హాట్ కామెంట్స్ కూడా చినబాబు చేస్తున్నారు. ఇది నిజంగా కడుపు మంటతో చేసిన కామెంట్ అని వైసీపీ మాత్రమే కాదు రాజకీయాల మీద ఆ మాత్రం అవగాహన ఉన్నవారు అంతా అంటున్నారు. ఈ దేశంలో నూటికి ఎనభై శాతం మంది జీవిస్తోందే సెంట్ జాగా స్థలంలో. పైగా అద్దెల భారంతో బతుకులు దీనంగా ఈడుస్తున్నారు అటువంటి వారికి ఇల్లు కట్టించి ఇవ్వడం అంటే గొప్పగానే చూడాలి కదా. అయినా సెంట్ జాగా అంటే అంత లోకువా పీసం ఎందుకవుతోంది. భూమి రేటు పెరిగిన కొద్దీ అది కూడా అమాంతం పెరుగుతుంది అన్నది తెలియదా అన్న చర్చ కూడా ఉంది. పేదల పక్షం వహించే వామపక్షాలు కూడా ఇపుడు పంథా మార్చుకుంటున్నాయి. ఇళ్ళు పేదలకు ఇవ్వలేదని గోల పెట్టే వారు తీరా ఇళ్ళ పట్టాలు పెద్ద ఎత్తున పంపిణీ చేస్తూంటే వంకలు పెట్టడం ఫక్త్ రాజకీయమే అవుతుంది అంటున్నారు. సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణకు అపారమైన అనుభవం ఉంది. లోకేష్ కి పేదల కష్టాలు తెలియకపోవచ్చు ఆయనకు అన్నీ తెలుసు. అయినా కూడా సెంటు జాగావే పేదలకు ఇస్తారా అంటూ నారాయణ గట్టిగా నోరు చేసుకోవడమే ఆశ్చర్యకరంగా ఉంది మరి. జగన్ సర్కార్ ఏది చేసినా తప్పుగా చెప్పాలన్న బాధ యావ తప్ప వామపక్ష సిద్ధాంతాలను పట్టించుకుంటున్నారా అన్న విమర్శలు కూడా వస్తున్నాయి. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తే అభినందించలేని వామపక్షాలు పేదలకు ఇళ్ళ పట్టాల విషయం లోనూ లోపాలు వెతకడంలో విద్దారం లేదని కూడా అంటున్నారు. రు.వైపు ఇళ్ల పట్టాలను ప్రభుత్వం పెద్ద ఎత్తున పంపిణీ చేస్తూంటే అందులో అవినీతి పెద్ద ఎత్తున జరిగిందంటూ బీజేపీ టీడీపీ తేడా లేకుండా మాట్లాడుతున్నాయి. అవినీతిని నిరూపిస్తామంటూ సవాళ్ళు చేస్తున్నాయి. సత్య ప్రమాణాలకు సిద్ధమంటున్నాయి. దీని మీద బీజేపీ నేత విష్ణువర్ధన్ రెడ్డి టీడీపీ నాయకులూ ఒకే తీరున మాట్లాడుతున్నారు. రైతులకు వ్యతిరేకంగా మూడు చట్టాలు చేశారంటూ ఓ వైపు ఢిల్లీలో రైతులు వేలాదిగా చలిని కూడా లెక్క చేయకుండా టెంట్లు వేసుకుని మరీ ఆందోళన చేస్తూంటే బీజేపీ మీద కిక్కురుమనని మిత్రుడు పవన్ కళ్యాణ్ ఏపీలో రైతుల గురించి మాత్రం అసెంబ్లీని ముట్టడిస్తాను అనడాన్ని ద్వంద్వ ప్రమాణాలు అనక మరేమనాలో. అంటే జగన్ టార్గెట్ గా ఏపీలోని విపక్షాలు అన్నీ రెచ్చిపోతునాయన్నదే అర్ధమవుతున్న విషయం. మరి ఏపీ జనాలు కూడా రేపటి రోజున జగన్ నచ్చితే ఓటు వేస్తాడు, నచ్చని వారు వేసే ఓటు మాత్రం ఇలా విపక్షాల మధ్య చీలిపోతే మళ్లీ జగనే వస్తాడు. ఇది ఎన్నికల గణితం చెప్పే సత్యం. ఇది గ్రహిస్తున్నారా విపక్షాలు అన్నదే ప్రశ్న.

## జగన్‌కు తలనొప్పిగా మారిన విగ్రహాల ధ్వంసం



**విజయవాడ, జనవరి 8, (ప్రజాపాలన) :** జగన్ అన్న మనిషిని నిండు కుండ అని ఎవరైనా అంటారు. ఆయన తండ్రి చనిపోయిన నాటి నుంచి ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దేశంలో ఏ రాజకీయ నాయకుడు పడనన్ని అవమానాలు భరించారు. ప్రత్యర్ధుల నుంచి ఆయన తిన్నన్ని తిట్లు ఎవరూ తినలేదు కూడా. అయినా ఎక్కడా ఆయన తన మనసులోని భావాలను బయటపెట్టుకోలేదు. బేలతనాన్ని కూడా చూపించలేదు. 2014 ఎన్నికలలో తృటిలో అధికారం తప్పిపోయినా కూడా జగన్ చిరునవ్వుతోనే మీడియా ముందుకు వచ్చారు. నెక్స్ట్ టైం బెటర్ లక్ అనుకున్నారు. అదే జరిగింది కూడా. కానీ ముఖ్యమంత్రి అయ్యాక మాత్రం జగన్ లోపలి మనిషి అపుడపుడు బయటకు వస్తున్నాడు.జగన్ సీఎం అయ్యాక చేయాల్సినవి చాలానే ఉన్నాయనుకున్నారు. కానీ ఆచరణకు వచ్చేసరికి మాత్రం ఆయనకు అనేక అడ్డంకులు ఎదురవుతున్నాయి. కోర్టు కేసులను ప్రతిపక్షాలు వేసి మరీ కథ ముందుకు సాగకుండా చేస్తున్నారు. అంతే కాదు కొన్ని కీలక నిర్ణయాలలో జగన్ ఏమీ కాని వానిగా జనం ముందు నిలబడాల్సివస్తోంది. ఇంకో వైపు చూస్తే ఏపీకి ఆదాయం అంతంతమాత్రంగా ఉంది. కరోనా కూడా పడగ విప్పి ఒక క్యాలండర్ ఇయర్ ని మింగేసింది. ఇంకో వైపు జమిలి ఎన్నికలు అంటున్నారు. దాంతో జగన్ అభివృద్ధి విషయంలో ఏమీ చేయకుండానే ఎన్నికలకు వెళ్తానా అన్న టెన్షన్ లో ఉన్నట్లుగా ప్రచారం అయితే ఉంది.జగన్ తనను అక్రమంగా జైలు పాలు చేసి విపక్షాలు వేధించినపుడు నాడు సభల్లో చెప్పిన మాట ఇదే. దేవుడు ఉన్నాడు. అన్నీ చూస్తున్నాడు. ప్రత్యర్ధులకు తగిన గుణపాఠం చెబుతాడు అని. జగన్ నిజంగా కష్టాల్లో ఉంటే దేవుడి ప్రస్థావనను తీసుకువస్తారు. ఇక ముఖ్యమంత్రి అయ్యాక ఇన్ని నెలల తరువాత జగన్ దేవుడు ఉన్నాడు అంటున్నారు. ఆయన పదే పదే ఈ మాట చెబుతున్నాడు. తాజాగా విజయనగరం సభలో జగన్ దేవుడు కరుణిస్తే అందరికీ న్యాయం చేస్తామని అంటూ ఎమోషన్ అయ్యారు. నిజంగా జగన్ ఎందుకు ఇంతలా భావోద్వేగం చెందారా అన్న చర్చ అయితే వస్తోంది. జగన్ కి దైవ భక్తి మెండు. ఏ రాజకీయ నాయకుడూ ప్రస్థావించని విధంగా ఆయన తన రాజకీయ సభల్లో దేవుడి గురించి తరచూ తెచ్చి మాట్లాడుతూంటారు. ఆయన క్రిస్టియన్ మతాన్నే నమ్మవచ్చు కానీ అన్ని మతాలను గౌరవిస్తారు. దేవుడు ఉన్నాడు అన్న ఆస్థికుడు జగన్. అటువంటి జగన్ మీద హిందూ మత వ్యతిరేకిగా చిత్రీకరిస్తూ అన్ని పార్టీలు విమర్శలు చేస్తూంటే బాధ కలిగి ఉంటుందన్న విశ్లేషణలు ఉన్నాయి. ఏపీలోని ప్రార్ధనా మందిరాల్లో వరసగా జరుగుతున్న దాడులు ముఖ్యమంత్రిగా జగన్ కి ఒక సవాల్‌గా మారాయి. అదే సమయంలో కొన్ని పార్టీలు మతం కార్డు ని తీయడం కూడా జగన్ కి ఇబ్బందిపెట్టే అంశమే. నాడు కృష్ణా పుష్కరాల సందర్భంగా అకారణంగా వందకు పైగా దేవాలయాలను నేలమట్టం చేసిన వారు కూడా ఇపుడు దేవుడి గురించి మాట్లాడుతూంటే వైసీపీ అధినేతకు బాధ కలగదా అని ఆ పార్టీలో వినిపిస్తున్న మాట. మరి జగన్ దేవుడిని నమ్ముకునే ఇంతదాకా రాజకీయాల్లో ముందుకు వచ్చారు. మరి ఇపుడు కూడా దేవుడు ఉన్నాడు అన్నీ చూస్తున్నాడు అంటున్నారు. ఆ విధంగా ఆయన తాను జనాలకు మంచి చేసే శక్తి ఆయన ఇవ్వాలని కోరుతున్నారు.

## యోగీ వన్ సైడ్‌గా వెళుతున్నారే..

**లక్నో, జనవరి 8, (ప్రజాపాలన) :** వన్ సైడ్ వెళ్లడం ఎప్పుడూ సరికాదు. ఆచితూచి నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుంది. ఉత్తర్ ప్రదేశ్ లో ఇదే జరుగుతుంది. యోగీ ఆదిత్యనాథ్ తీసుకున్న నిర్ణయంపై మాజీ ఐఏఎస్ అధికారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు 104 మంది మాజీ ఐఏఎస్ అధికారులు యోగి ఆదిత్యనాథ్‌కు లేఖ కూడా రాశారు. వెంటనే ప్రజా వ్యతిరేక ఆర్డినెన్స్‌ను ఉపసంహరించుకోవాలని మాజీ ఐఏఎస్‌లు ఆ లేఖలో కోరారు. యోగీ ఆదిత్యానాథ్ ప్రభుత్వం లవ్ జీహాద్ కు వ్యతిరేకంగా ఆర్డినెన్స్‌ను తీసుకు వచ్చింది. మత మార్పిడులకు పాల్పడితే చర్యలు తప్పవని ఈ ఆర్డినెన్స్ ద్వారా యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం హెచ్చరించింది. ఇప్పటికే ఈ ఆర్డినెన్స్ కింద ఉత్తర్‌ప్రదేశ్‌లో నమోదవుతున్న కేసులపై మాజీ ఐఏఎస్ లు అభ్యంతరం వ్యక్తం చేశారు. మొరాదాబాద్ లో ఒక యువకుడిని భజరంగ్ దళ్ కార్యకర్తలు కొట్టడమే కాకుండా ఆ యువకుడిపై ఈ యాక్ట్ కింద కేసు నమోదు చేశారు.ఆ యాక్టును అడ్డం పెట్టుకుని ఉత్తర్ ప్రదేశ్ లో అనేక మంది యువజంటలను భజరంగ్ దళ్ కార్యకర్తలు వెంటపడి వేధిస్తున్నారని మాజీ ఐఏఎస్ అధికారులు యోగి ఆదిత్యనాథ్ కు రాసిన లేఖలో పేర్కొన్నారు. ఇప్పటికే ఈ యాక్టుపై ఉత్తర్ ప్రదేశ్ లో యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వంపై ఒక వర్గంలో తీవ్ర అసంతృప్తి నెలకొంది. రాజకీయ పార్టీలైన సమాజ్ వాదీ పార్టీ, బహుజన్ సమాజ్ పార్టీలు ఈ యాక్ట్ పై పోరాడుతున్నా ఫలితం లేదు.యోగి ఆదిత్యనాథ్ హిందుత్వ అజెండాతో ఆర్డినెన్స్ లను రుద్దుతూ పౌరహక్కులకు భంగం కల్గిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

# పెద్దారెడ్డికి క్యాంప్ ఆఫీసులో తలంటు..

**అనంతపురం, జనవరి 8, (ప్రజాపాలన) :** అనంతపురం జిల్లా తాడిపత్రి గత పది రోజుల నుంచి వార్తల్లో నానుతూనే ఉంది. సవాళ్లు.. ప్రతిసవాళ్ల స్థాయి దాటి తీయండ్రా బళ్లు అన్న రేంజ్ దృశ్యాలు అక్కడ కనిపించాయి. తాడిపత్రి వైసీపీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఏకంగా టీడీపీ మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్‌రెడ్డి ఇంట్లోకి అనుచరగణంతో వెళ్లడం.. తదనంతర పరిణామాలు రాష్ట్ర రాజకీయాల్లో హీట్ పెంచాయి. ఈ వివాదం అటు చేరి ఇటు చేరి చివరికి సీఎం క్యాంప్ ఆఫీస్ కి చేరింది.సీఎం క్యాంప్ ఆఫీసు నుంచి కబురెళ్లడంతో పెద్దారెడ్డి తాడేపల్లి రావడం.. ఆ సందర్భంగా జరిగిన పరిణామాలపై పార్టీ వర్గాల్లో కథలు కథలుగా చెప్పుకొంటున్నారు. తాడిపత్రి ఎపిసోడ్‌లో ఎమ్మెల్యే పెద్దారెడ్డి తీరుపై అటు ప్రజల్లోనూ ఇటు వైసీపీలోనూ తీవ్ర చర్చకే దారితీసింది. తాడిపత్రి ఘటన జరిగిన సమయంలో రాష్ట్రంలో అట్టహాసంగా ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు సీఎం జగన్. వైసీపీ ప్రభుత్వం చేపట్టిన అతిపెద్ద సంక్షేమ కార్యక్రమం ఇది. ఇళ్ల పట్టాల పంపిణీ ద్వారా భారీ ప్రచారంతోపాటు పొలిటికల్ మైలేజీ గురించి వైసీపీ ఎన్నో లెక్కలు వేసుకుంది. కానీ.. తాడిపత్రి ఘటనతో సీన్ మొత్తం రివర్స్ అయింది. ఇళ్ల పట్టాల పంపిణీకి రావాల్సినంత ప్రచారం రాలేదు. మీడియా అటెన్షన్ మొత్తం పది రోజులుగా తాడిపత్రి చుట్టూనే తిరుగుతోంది. ఈ విషయంలో వైసీపీ ప్రభుత్వం అనుకున్నదొక్కటీ అయ్యిందొక్కటి. ఇళ్ల పట్టాల పంపిణీని సీఎం జగన్‌తోపాటు ఎక్కడికక్కడ మంత్రులు, వైసీపీ ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లో అట్టహాసంగా చేద్దామని ప్లాన్ చేసుకున్నారు.

కానీ తాడిపత్రి ఎపిసోడ్ రావణకాష్టంలా మారి అధికార పార్టీ నేతలను నిరాశ చెందారు. పైగా తాడిపత్రి ఎమ్మెల్యే పెద్దారెడ్డి ఢీకొట్టింది జేసీ బ్రదర్స్‌ను. వారిని రాజకీయంగా ఎదుర్కోవాలంటే ఒక వ్యూహం.. కార్యాచరణ ఉంటుంది. పెద్దారెడ్డి అవేవీ పట్టించుకోకుండా.. సీమ ఫ్యాక్షన్ సినిమాను అందరికీ చూపించారు. సీసీ కెమెరాలకు దొరికిపోయారు. తాడిపత్రి ఎపిసోడ్‌పై వివరణ ఇవ్వాలని సీఎం క్యాంప్ ఆఫీస్ నుంచి కబురు అందగానే క్షణం ఆలస్యం చేయలేదు ఎమ్మెల్యే పెద్దారెడ్డి. అయితే రాగానే సీఎం అపాయింట్‌మెంట్ దొరకలేదట. దాదాపు 5 గంటలు వేచి చూసిన తర్వాత ముఖ్యమంత్రి పిలిచారట. ఎమ్మెల్యే పెద్దారెడ్డి ఏదో చెప్పబోతుంటే ముఖ్యమంత్రి మాత్రం గట్టిగానే క్లాస్ తీసుకుని పంపించారని తెలుస్తోంది. ఏదో ముఖ్యమంత్రి అన్నారు కదా.. ఎమ్మెల్యే పెద్దారెడ్డి పడక తప్పదు అని అనుకోవచ్చు. కానీ.. ఈ ఎపిసోడ్ అక్కడితో ఆగలేదట. క్యాంప్ ఆఫీసుకొచ్చి.. సీఎం పిలవడానికి మధ్య ఉన్న ఐదు గంటల వెయిటింగ్ టైమ్ పెద్దారెడ్డికి మరింత నరకంగా అనిపించిందట. ఈ సమయంలో సీఎంతో సమీక్ష కోసం వచ్చిన మంత్రులు..అక్కడ తారసపడ్డ పార్టీ పెద్దలు పెద్దారెడ్డికి ఓ రేంజ్ లో క్లాస్ తీసుకున్నారట..ముందుగా ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి వంతు వచ్చిందట. పెద్దారెడ్డి చెప్పిందంతా విన్న సజ్జల.. చివరకు మీరు చేసిందేం కరెక్ట్ కాదు అని ముఖం మీదే చెప్పేశారట. ఆ తర్వాత జిల్లా ఇంఛార్జ్ మంత్రి బొత్స సత్యనారాయణ కూడా అంతే స్థాయిలో క్లాస్ తీసుకున్నారట. ఆలోచించక్కర్లేదా.. అలా ఎవరైనా చేస్తారా అని తన స్టయిల్లో మందలించారట బొత్స. చివర్లో సీఎం సరేసరి. క్లైమాక్స్ లో సీఎమ్ సార్ తో అసలు డోస్ పడటంతో బతుకు జీవుడా అని క్యాంపు ఆఫీసు నుంచి బయటపడ్డారట పెద్దారెడ్డి.సోషల్ మీడియాలో ఏవరో ఏదో అన్నారని ఆవేశపడినందుకు ఆయనకు క్యాంప్ ఆఫీసులో గట్టిగానే తలంటారట. ఓ వైపు వెయిటింగ్ మరోవైపు కనిపించిన వాళ్ళందరు ఇలా ఎందుకు చేశావయ్యా అని అడిగేసరికి నీళ్లు నములడం పెద్దారెడ్డి వంతైంది.

# జనసేనకు తిరుపతి..?

**తిరుపతి, జనవరి 8, (ప్రజాపాలన) :** తిరుపతి ఉప ఎన్నికల బీజేపీకి ప్రతిష్టాత్మకంగా మారింది. తిరుపతి ఉప ఎన్నిక విషయంలో తేడా కొడితే పార్టీ బలోపేతానికి ఎలా ముందుకు వెళ్లాలన్న దానిపై బీజేపీ నేతలు సీరియస్ గా ఆలోచిస్తున్నారట. తిరుపతి ఉప ఎన్నికలో ఓటమి పాలయినా మరో ఉప ఎన్నికను రప్పించి నెగ్గేలా ప్రణాళికను సిద్ధం చేసుకుంటున్నారని పార్టీలో జోరుగా ప్రచారం జరగుతుంది. తిరుపతి ఉప ఎన్నికలో ఎవరు పోటీ చేసి ఓటమి పాలయినా అది బీజేపీ, జనసేన పై భవిష్యత్ లో ప్రభావం పడనుంది.తిరుపతి ఉప ఎన్నికలో టీడీపీని కాదని రెండో ప్లేస్ కు వచ్చే ఛాన్స్ లేదని బీజేపీ నేతలకు తెలియంది కాదు. పైకి పెద్ద పెద్ద స్టేట్ మెంట్లు ఇస్తున్నా లోపల మాత్రం ఓటమి తప్పదని ఫిక్స్ అయ్యారు. ఇక్కడ వైసీపీ, టీడీపీ బలంగా ఉండటమే అందుకు కారణం. బీజేపీ ఇక్కడ పోటీ చేయాలనుకుని తొలుత అనుకున్నా తర్వాత పునరాలోచనలో పడ్డారన చెబుతున్నారు. తిరుపతి ఎంపీ అభ్యర్థిగా జనసేన కే కేటాయిస్తే బాగుంటుందని పలువు సూచిస్తున్నారు.కారణం లేకపోలేదు. తిరుపతి ఉప ఎన్నికలో ఓటమి పాలయితే ఆ ఎఫెక్ట్ బీజేపీ పైనే ఎక్కువగా పడుతుంది. అందుకే ఇప్పుడు నర్సాపురం పార్లమెంటుపై బీజేపీ నేతల కన్ను పడిందంటున్నారు. నర్సాపురంలో బీజేపీ స్ట్రాంగ్ గా ఉంది. అలాగే జనసేన కు కూడా బలమైన సామాజికవర్గం అండగా ఉంటుంది. అందుకే నర్సాపురం ఉప ఎన్నిక రప్పించాలన్న ఆలోచనలో బీజేపీ నేతలు ఉన్నారని కొందరు పార్టీ నేతలే చెబుతున్నారు. వైసీపీ ఇప్పటికే తన పార్టీ ఎంపీ రఘురామకృష్ణంరాజుపై అనర్హత పిటీషన్ ఇచ్చింది. ఆయనను అనర్హుడిగా ప్రకటిస్తే ఉప ఎన్నిక అనివార్యమవుతుంది. మరోవైపు అదే రఘురామకృష?ణంరాజును బీజేపీలోకి తీసుకు వచ్చి పోటీ చేయిస్తే సులువుగా నెగ్గగలమని బీజేపీ నేతలు భావిస్తున్నారు. అందుకే తిరుపతి ఉప ఎన్నికను జనసేనకే వదిలేయాలని బీజేపీ లో కొందరు గట్టిగా వాదిస్తున్నారు. పార్టీ సీనియర్ నేతలు సయితం ఇదే రకమైన అభిప్రాయం వ్యక్తం చేస్తుండటం విశేషం. మొత్తం మీద తిరుపతి కంటే నర్సాపురం పార్లమెంటుపైనే బీజేపీ ఎక్కువగా దృష్టి పెట్టినట్లు కన్పిస్తుంది.

# అంతా విష్ణు మాయ..

**విశాఖపట్టణం, జనవరి 8, (ప్రజాపాలన) :** రాష్ట్ర రాజకీయాల్లో పెన్మత్స విష్ణుకుమార్ రాజు స్టయిలే వేరు. ఆయన ఉన్నది బీజేపీలో. అయితే.. ఆయన రాజకీయాలు మాత్రం ఏ పార్టీతో ఎలా ఉంటాయో చెప్పడం కష్టం. ఇదేదో గిట్టని వారు.. ఆయనపై ఉన్న ప్రత్యర్థి వర్గాలు చెబుతున్న మాట కాదు. ఏకంగా బీజేపీ సీనియర్లే అంటున్న కామెంట్లు. సీనియర్ నాయకుడు.. అంతో ఇంతో ఆర్ఎస్ఎస్ భావజాలానికి కూడా ఆయన సంపూర్ణ మద్దతు దారు. అయితే.. నిన్నగాక మొన్న పార్టీలోకి వచ్చిన వారితో పోలిస్తే.. విష్ణుకుమార్ రాజు పార్టీ నేతలతో కలిసిపోయే తీరు మాత్రం ప్రశ్నార్థకమే. ఆయన ఎప్పుడు ఎక్కడ ఎలాంటి ప్రకటన చేస్తారో బీజేపీ నేతలు సైతం చెప్పలేరు. గతానికి, ఇప్పటికి విష్ణుకుమార్ రాజులో మార్పు లేదు. పార్టీలో ఉన్నా.. ఏనాడూ.. బీజేపీ జెండా పట్టుకుని ఓ వంద సభ్యత్వాలు రాయించిన రికార్డు ఆయనకు లేదు. పోనీ.. బలంగా బీజేపీ వాయిస్ వినిపించిందీ లేదు. గతంలో చంద్రబాబు హయాంలో ఆయన ఆ పార్టీకి మద్దతు దారుగా వ్యవహరించారనే వాయిస్ వినిపించింది. నేరుగా అసెంబ్లీలోనే చంద్రబాబును పొగడ్తలతో ముంచెత్తారు. ఆయన బీజేపీ విప్‌గా ఉన్నా చాలా మంది టీడీపీ ఎమ్మెల్యేలకు చంద్రబాబు దగ్గర లేని గుర్తింపు సొంతం చేసుకోవడంతో పాటు తాను కోరిన పనులు కోరినట్టు బాబు చేసేలా విష్ణుకుమార్ రాజు చక్రం తిప్పారు.అదే సమయంలో విష్ణుకుమార్ రాజు జగన్‌పైనా అభిమానం చూపించారు. ఒకానొక దశలో ఎన్నికలకు ముందు ఆయన వైసీపీలోకి వచ్చేస్తున్నారన్న ప్రచారం జరిగేంతగా జగన్‌పై అభిమానం పెంచుకున్నారు. అదే సమయంలో బీజేపీ నేతలతో ఏమైనా దగ్గర బంధాలు కొనసాగిస్తున్నారా? అంటే.. ఎక్కడా కనిపించడం లేదు. పైగా ఆయన ఎప్పుడు మైకు పుచ్చుకున్నా.. బీజేపీ గురించి మాట్లాడింది తక్కువ. ప్రస్తుతం ఏపీ వరకు చూస్తే బీజేపీ ఓ సంక్లిష్ట పరిస్థితిలో ఉంది. ఒకవైపు పవన్‌తో పొత్తును పెట్టుకుని ముందుకు సాగుతూనే ఒంటరిగా సత్తా చాటేందుకు ఎదిగేందుకు కూడా కమలం పార్టీ ప్రయత్నిస్తోంది. ఈ నేపథ్యంలో నాయకుల మద్దతు పార్టీకి, పార్టీ మద్దతు నాయకులకు కూడా అవసరం.ఈ క్రమంలో ఎవరు మైకు పుచ్చుకుని మాట్లాడినా.. అక్కున చేర్చుకునేందుకు బీజేపీ నాయకులు సిద్ధంగానే ఉన్నారు. మరీ ముఖ్యంగా ఇప్పుడున్న వారిని గమనిస్తే.. ప్రజాక్షేత్రంలో గెలిచిన వారు ఎవరూ బీజేపీ తరఫున వాయిస్ వినిపించడం లేదు. గతంలో గెలిచిన వారు.. అంతో ఇంతో ప్రజల్లో బలం ఉన్న వారు మౌనంగా ఉన్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో తటస్థంగా ఉండే విష్ణుకుమార్ రాజుకు ఎదిగేందుకు మంచి గ్యాప్ ఉన్నప్పటికీ ఆయన తన వైఖరి కారణంగా.. పార్టీలో నేతలకు దూరమవుతున్నారనే వాదన బలంగా వినిపిస్తుండడం గమనార్హం.

# భూమా కుటుంబానికి మసక..

**కర్నూలు, జనవరి 8, (ప్రజాపాలన) :** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో భూమా నాగిరెడ్డి కుటుంబానికి ప్రత్యేకస్థానం ఉంది. భూమా నాగిరెడ్డి, శోభ మృతి తరువాత ఆ కుటుంబం వరుస వివాదాల్లో చిక్కుకుంటోంది. మొన్నటి దాకా ఆళ్లగడ్డ, నంద్యాలకే పరిమితమైన వివాదాలు.. ఇప్పుడు పక్కరాష్ట్రానికి చేరాయి. భూమా కుటుంబానికి ఏమైంది ? హఫీజ్ పేట భూముల వివాదంలో అఖిలప్రియ అరెస్టు చర్చనీయాంశమైంది. భూమా నాగిరెడ్డి కూడా వివాదాస్పదమయ్యారు.. అయితే ఆయన వివాదాల తీరు వేరు. భూమా నాగిరెడ్డి అనగానే గుర్తొచ్చేది ఫ్యాక్షన్ రాజకీయాలు. సుదీర్ఘ కాలం టీడీపీలోనే ఉన్నా.. ఆ తర్వాత ప్రజారాజ్యం, అక్కడి నుంచి వైసీపీ, తిరిగి టీడీపీలో చేరింది భూమా నాగిరెడ్డి కుటుంబం. 2014 ఎన్నికల సమయంలో భూమా శోభ రోడ్డు ప్రమాదంలో, 2017లో భూమా నాగిరెడ్డి గుండెపోటుతో మృతి చెందారు. భూమా నాగిరెడ్డి దంపతులు మృతి తరువాత.. రాజకీయ పగ్గాలు ఆయన కూతురు అఖిలప్రియ చేపట్టారు. ఆళ్లగడ్డ నుంచి ఎమ్మెల్యేగా గెలిచి మంత్రి పదవి కూడా చేపట్టారు. అయితే గత ఎన్నికల్లో భూమా కుటుంబం.. నంద్యాల, ఆళ్లగడ్డలో ఓడిపోయినప్పటి నుంచి అఖిలప్రియను వివాదాలు వెంటాడుతున్నాయి. నాగిరెడ్డికి అత్యంత సన్నిహితుడైన ఏవీ సుబ్బారెడ్డితో అఖిలప్రియకు వివాదాలు మొదలయ్యాయి. అఖిల, ఏవి సుబ్బారెడ్డి మధ్య విబేధాలు ప్రధానంగా ఆర్ధికపరమైనవే. నాగిరెడ్డి ఆస్తులు, వ్యాపారాలకు సంబంధించిన సమాచారం అంతా ఏవి సుబ్బారెడ్డికి తెలుసని, తమకు రావాల్సిన ఆస్తులను ఆయన దాచిపెడుతున్నారనేది భూమా అఖిల అనుమానం. ఇద్దరి మధ్యా విభేదాలు తారాస్థాయికి చేరాయి. ఒక సందర్భంలో ఏవి సుబ్బారెడ్డి సైకిల్ యాత్ర చేస్తుండగా భూమా అఖిల వర్గీయులు రాళ్ళ దాడి చేశారు. నంద్యాలలో కూడా అఖిలవర్గీయులు , ఏవి సుబ్బారెడ్డి వర్గీయులు కొట్టుకున్నారు. అఖిలప్రియ, ఏవి సుబ్బారెడ్డి మధ్య విబేధాల్లో అఖిల భర్త భార్గవరాముడు జోక్యంతో వివాదం మరింత ముదిరింది. విబేధాలు ఎంత వరకు దారి తీసాయంటే ఏవి సుబ్బారెడ్డి హత్యకు కుట్ర పన్నే వరకు వెళ్లాయి. ఏవి సుబ్బారెడ్డి హత్యకు కుట్రను కడప పోలీసులు భగ్నం చేసి ముగ్గురిని అరెస్ట్ చేశారు. ఘటనలో అఖిల భర్త భార్గవ రామునిపై కడప పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో భార్గవ రాముడిని అరెస్ట్ చేయాలని పలుసార్లు ఏవి సుబ్బారెడ్డి కడప పోలీస్ అధికారులపై ఒత్తిడి చేశారు.ఎన్నికల్లో ఓటముల సంగతి ఎలా ఉన్నా.. నంద్యాల, ఆళ్లగడ్డలో భూమా కుటుంబానికి గట్టి పట్టు ఉంది. ఈ ప్రాంతాల్లో భూమా నాగిరెడ్డి సోదరుల కుటుంబాలు, బంధువర్గం, అనుచరవర్గం ఉంది. అయితే ఇటీవల భూమా కుటుంబంలో కూడా విబేధాలు వచ్చాయి. భూమా నాగిరెడ్డి సోదరుని కుమారుడు భూమా కిశోర్ రెడ్డి.. అఖిలప్రియతో విభేదించి బీజేపీలో చేరడంతో ఆ కుటుంబంలో చీలిక వచ్చింది. తాజాగా విజయ డైరీ చైర్మన్ పదవి భూమా కుటుంబంలో మరో చీలికకు దారితీసింది. చైర్మన్ గా నాగిరెడ్డి చిన్నాన్న భూమా నారాయణ రెడ్డి మూడు దశాబ్దాలకు పైగా కొనసాగుతున్నారు. ఇప్పుడు ఆ చైర్మన్ పదవిని చేజిక్కించుకునేందుకు నాగిరెడ్డి తనయుడు జగత్ విఖ్యాత రెడ్డి ప్రయత్నిస్తున్నారు. అందులో భాగంగానే నారాయణరెడ్డి ఇంటికి భార్గవ రాముడు, విఖ్యాత రెడ్డి వెళ్లడంతో విభేధాలు రెచ్చకెక్కాయి. అఖిల సోదరుడు భూమా విఖ్యాత రెడ్డి, భర్త భార్గవ రాముడుపై కేసు కూడా నమోదయింది.ఆళ్లగడ్డలో కంకర ఫ్యాక్టరీ వివాదంలోనూ భార్గవరామునిపై కేసులు నమోదయ్యాయి. ఎన్నికల సమయంలో కూడా భార్గవ రామునిపై కేసులు నమోదయ్యాయి. తాజాగా హఫీజ్ పేట భూముల వివాదంతో.. ఏకంగా అఖిలప్రియ అరెస్ట్ అయ్యారు. భూమా అఖిలకు , ఏవి సుబ్బారెడ్డి కి కత్తులు దూసుకునేంత వైరం ఉంది. అయితే కిడ్నాప్ వ్యవహారంలో ఇద్దరిపైన కేసు నమోదయింది. ఈ కిడ్నాప్ తో సంబంధం లేదని ఏవి సుబ్బారెడ్డి వాదిస్తుండగా.. ఇద్దరూ కలిసిపోయారా అనే చర్చ కర్నూలు జిల్లాలో జరుగుతోంది. మొత్తమ్మీద రాజకీయంగా బలమైన కుటుంబం వివాదాల్లో కూరుకుపోవడం.. తెలుగు రాష్ట్రాల్లో చర్చనీయాంశంగా మారింది.

# సినిమాస్కోప్

## ఈసారి వకీల్ సాబ్ టీజర్ డైలాగ్

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటిస్తున్న వకీల్ సాబ్ టీజర్ కోసం చాలా నెలలుగా అభిమానులు ఎదురు చూస్తున్నారు. ఎట్టకేలకు ఈ టీజర్ కు ముహూర్తం కుదిరింది. సంక్రాంతి సందర్భంగా ఈనెల 14వ తారీకున టీజర్‌ను విడుదల చేయబోతున్నట్లుగా అధికారికంగా ప్రకటన వచ్చింది. టీజర్ పై అంచనాలు భారీగా ఉన్నాయి. ఇప్పటికే షూటింగ్ పూర్తి అవ్వడంతో టీజర్ ఎడిటింగ్ లో దర్శకుడు బిజీగా ఉన్నాడు. దిల్ రాజు ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఈ సినిమాను నిర్మిస్తున్నాడు. బాలీవుడ్ పింక్ కు రీమేక్ అయిన ఈ సినిమాను కమర్షియల్ టచ్ ఇచ్చి రీమేక్ చేస్తున్న విషయం తెల్సిందే. ఈ సినిమా ప్రారంభం నుండి లీక్ ల సమస్య వెంటాడుతూనే ఉంది. టీజర్ లో రాబోతున్న డైలాగ్ ఒకటి ఇప్పుడు సోషల్




మీడియాలో ట్రెండ్ అవుతోంది. టీజర్ లో మెట్రో రైలు ఫైటింగ్ సీన్ ఒకటి ఉంటుందట. ఆ సందర్భంగా పవన్ కోర్టులో కోట్ వేసుకుని వాదించగలను.. బయట కోట్ తీసి వాయించగలను అంటూ డైలాగ్ చెప్తాడట. ఆ ఫైట్ కాస్త ఫన్నీగా కూడా ఉంటుందని అంటున్నారు. టీజర్ లో ఆ డైలాగ్ తో పాటు కొన్ని యాక్షన్ సీన్స్ మరియు కోర్టు సన్నివేశంను ఒక షాట్ వేయబోతున్నారట. పవన్ ఏం చేసినా కూడా అభిమానులు చొక్కాలు చించుకోవడం ఖాయం. అలాంటిది ఇలాంటి పంచ్ డైలాగ్ లు వేస్తే ఇంకేమైనా ఉందా.. ఖచ్చితంగా ఈ టీజర్ కు పవన్ అభిమానులు రికార్డులు కట్టబెట్టడం ఖాయం అంటున్నారు.

## ప్రభాస్ అభిమానుల ఎదురు చూపులకు తెర పడేది ఎప్పుడో?

సౌత్ సినీ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న సినిమాలు కేజీఎఫ్ 2.. రాధేశ్యామ్. ఈ రెండు సినిమాల కోసం యావత్ దేశం మొత్తం సినీ అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు అనడంలో సందేహం లేదు. ఈ రెండు సినిమాలతో పాటు వకీల్ సాబ్ సినిమా కోసం కూడా పవన్ అభిమానులు ఎంతో ఉత్కంఠతతో ఎదురు చూస్తున్నారు. ఈ మూడు సినిమాలు గత ఏడాది రావాల్సినవే అయినా కూడా కరోనా కారణంగా ఈ ఏడాదికి షిఫ్ట్ అయ్యాయి. ఈ మూడు సినిమాల టీజర్ ల కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఎట్టకేలకు కేజీఎఫ్ 2 టీజర్ వచ్చేసింది. ఊహించినట్లు గానే కేజీఎఫ్ 2 టీజర్ అంతకు మించి అన్నట్లుగా ఉంది. అద్భుతం గా ఉన్న టీజర్ సినిమాపై అంచనా లను మరింతగా పెంచింది. ఇక వకీల్ సాబ్ టీజర్ ను సంక్రాంతి కానుకగా జనవరి 14న విడుదల చేయబోతున్నట్లుగా ప్రకటించారు. కాని ఇప్పటి వరకు రాధే శ్యామ్ టీజర్ విషయంలో మాత్రం క్లారిటీ లేదు. రాధేశ్యామ్ షూటింగ్ పూర్తి అయ్యిందనే వార్తలు వస్తున్నాయి. అయినా కూడా అప్ డేట్ విషయంలో మాత్రం క్లారిటీ ఇవ్వడం లేదు.




టీజర్ సంక్రాంతికి వస్తుందని అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. మరి ప్రభాస్ అభిమానుల ఎదురు చూపులకు సంక్రాంతికి తెర పడేనా లేదంటే ఉగాది వరకు వెయిట్ చేయాల్సి రావచ్చా అనేది ఒకటి రెండు రోజుల్లోనే క్లారిటీ రాబోతుంది.

## నాన్ స్టాప్ గా 20 ఏళ్లు పూర్తిచేసిన శ్రియ

ఎప్పుడూ ఒకే భంగిమలో నిలబడటం కష్టమనిపించి కాస్తంత కాలు .. చేయి కదిలించడానికి ప్రయత్నించే అజంతా శిల్పంలా శ్రియ కనిపిస్తుంది. అందం అంటే ఇలా ఉంటుంది .. ఆకర్షణ అంటే అలా ఉంటుంది అని తెరపై తనని చూసి చెప్పుకునేలా శ్రియ చేసింది. సాధారణంగా కెరియర్ ను మొదలుపెట్టిన తరువాత ఎక్కడో అక్కడ కొంత గ్యాప్ వస్తూ ఉంటుంది. కానీ అసలు గ్యాప్ అనేది రానీయకుండా శ్రియ ఇరవై ఏళ్ల పాటు కెరియర్ ను లాక్కొచ్చిందంటే అది సాధారణమైన విషయమేం కాదు. తన బాడీ షేప్ లోను ఎలాంటి మార్పులు రాకుండా చూసుకోవడం మరో విశేషం. 'ఇష్టం' సినిమాతో తెలుగు తెరకి పరిచయమైన శ్రియ చకచకా అవకాశాలను అందుకుం ది. 'సంతోషం' .. 'నువ్వే నువ్వే' .. 'ఠాగూర్' .. 'నేనున్నాను' .. వంటి సినిమాలు ఆమె కెరియర్ ను పరుగులు పెట్టించాయి. ఒక వైపున యువ హీరోలతో ఆడిపాడుతూనే మరో వైపున సీనియర్ స్టార్ హీరోల సరసన సైతం మెప్పించింది. తెలుగు .. తమిళ .. మలయాళ .. కన్నడ .. హిందీ సినిమాలు చేస్తూ ఎక్కడా గ్యాప్ రాకుండా చూసుకుం ది. ఒకానొక దశలో తెలుగు ప్రేక్షకులతో గ్యాప్ పెరుగుతుందని భావించిన ఆమె ఆ వెంటనే 'గోపాల గోపాల' .. 'గౌతమీ పుత్ర శాతకర్ణి' .. 'పైసా వసూల్' సినిమాలతో బ్యాలెన్స్ చేసింది. యితే ఇటీవల కాలంలో సీనియర్ హీరోల ప్రాజెక్టులలో ఆమె పేరు వినిపించకపోవడం ఆశ్చర్యమే. ప్రస్తుతం రెండు తమిళ సినిమాలు చేస్తున్న ఆమె తెలుగులో మాత్రం ఇటీవలే 'గమనం' చేసింది. డిఫరెంట్ కాన్సెప్ట్ తో రూపొందిన ఈ సినిమాలో ఆమె 'వినికిడి లోపం' కలిగిన పాత్రలో నటించిం ది. ఈ పాత్ర తనకి మంచి పేరు తెస్తుందని ఆమె భావిస్తోంది. త్వరలోనే ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఆల్రెడీ 20 ఏళ్ల కెరియర్ ను చూసేసిన శ్రియ .. 60కి పైగా సినిమాలు చేసేసిన శ్రియ ఇంకా పోరాడుతూనే ఉండ టం విశేషం. అది ఆమె అంకితభా వానికి నిదర్శనం.



## భార్యామణి బర్త్ డే సెలబ్రేషన్స్ లో యూత్ స్టార్..!


టాలీవుడ్ యువ హీరో నితిన్ తన ప్రియసఖి షాలిని ని వివాహం చేసుకొని ఓ ఇంటివాడైన సంగతి తెలిసిందే. లాక్ డౌన్ టైంలో జులై 26న వీరి వివాహం కుటుంబ సభ్యులు.. కొద్దిమంది సన్నిహితులు అతిథుల సమక్షంలో జరిగింది. ప్రస్తుతం సినిమా షూటింగ్స్ తో బిజీగా ఉన్న నితిన్ తన సతీమణి పుట్టినరోజు వేడుకను ఘనంగా సెలబ్రేట్ చేశాడు. పెళ్లి తర్వాత వచ్చిన భార్యామణి బర్త్ డేని క్లోజ్ ఫ్రెండ్స్ కలిసి జరిపినట్లు తెలుస్తోంది. ఈ పార్టీకి హాస్యనటుడు వెన్నెల కిషోర్ – 'భీష్మ' దర్శకుడు వంశీ కుడుముల కూడా హాజరయ్యారు. వెన్నెల కిషోర్ దీనికి సంబంధించిన ఓ ఫోటోని సోషల్ మీడియా మధ్యమాలలో పోస్ట్ చేస్తూ షాలిని కి బర్త్ డే విషెస్ తెలియజేసాడు. ఇందులో నితిన్ – షాలిని దంపతులతో పాటు వెన్నెల కిషోర్ – వంశీ కుడుముల కనిపిస్తున్నారు. ఇంతకముందు నితిన్ తన భార్యకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ 'నా లవ్లీ వైఫ్ కి బర్త్ డే విషెస్.. నేను నీతో గడిపిన సమయాలు నా రోజులోని సంతోషకరమైన క్షణాలు' అంటూ



ట్వీట్ చేశాడు. దీనికి తన సతీమణితో కలసి దిగిన ఓ ఫోటోను షేర్ చేశాడు. ఇక సినిమాల విషయానికొస్తే నితిన్ ప్రస్తుతం వెంకీ కుడుముల దర్శకత్వంలో 'రంగ్ దే' సినిమాలో నటిస్తున్నాడు. అలానే చంద్రశేఖర్ ఏలేటి దర్శకత్వంలో 'చెక్' అనే సినిమా చేస్తున్నాడు. వీటితో పాటు మేర్లపాక గాంధీతో కలిసి 'అంధాదున్' తెలుగు రీమేక్ లో నటించనున్నాడు. ఇవి పూర్తైన తర్వాత కృష్ణ చైతన్య దర్శకత్వంలో 'పవర్ పేట' అనే సినిమా చేయనున్నాడు.

## 'అల్లుడు అదుర్స్' ప్రీపోస్టుపోన్ కాబోతుందా..??


అల్లుడుశీను సినిమాతో తెలుగు ఇండస్ట్రీలో కథానాయకుడుగా అరంగేట్రం చేసాడు బెల్లంకొండ సాయి శ్రీనివాస్. ప్రొడ్యూసర్ బెల్లంకొండ సురేష్ కొడుకుగా ఎంట్రీ ఇచ్చిన శ్రీనివాస్ నటనపరంగా చాలా విమర్శలు ఎదుర్కొన్నాడు. కానీ సినిమా సినిమాకి తన యాక్టింగ్ స్కిల్స్ మెరుగు పరుచుకుంటూ మంచి గుర్తింపు సొంతం చేసుకున్నాడు. ఈ యువహీరో చివరిగా నటించిన రాక్షసుడు సూపర్ హిట్ తర్వాత ప్రస్తుతం అల్లుడు అదుర్స్ అనే ఫుల్ లెంగ్త్ వినోదభరిత సినిమాలో నటించాడు. ఈ సినిమా సంక్రాంతి కానుకగా జనవరి 15న విడుదల చేయబోతున్నట్లు ప్రకటించారు మేకర్స్. అలాగే మోషన్ పోస్టర్స్ లిరికల్ సాంగ్స్ ట్రైలర్ లతో ఇప్పటికే ప్రమోషన్స్ తో ఫుల్ బిజీగా ఉన్నారు చిత్రబృందం. ఇప్పటికే 15న రాబోతుందని అంతా ఫిక్సై సన్నద్ధం అవుతున్నారు. అయితే తాజా సమాచారం ప్రకారం.. అల్లుడు అదుర్స్ 15 వరకు వెయిట్ చేయకుండా ఇంకాస్త ముందుగానే థియేటర్లలోకి వచ్చే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తుంది. క్రాక్ సినిమా సంక్రాంతి బరిలో అని చెప్పి జనవరి 9కి ప్రీపోస్టుపోన్ అయింది. అలాగే అల్లుడు అదుర్స్ కూడా 15 నుండి 14కు పోస్టుపోన్ అయ్యే అవకాశం ఉందట. అంటే రెడ్ సినిమాకు పోటీగా నిలుస్తుందని భావిస్తున్నారు. జనవరి 14న సంక్రాంతి పండుగ సందర్భంగా అల్లుడు అదుర్స్ రామ్ రెడ్ సినిమాలు తాడోపేడో తేల్చుకునే



సూచనలు కనిపిస్తున్నాయి. కానీ ఇంకా అల్లుడు అదుర్స్ ప్రీపోస్టుపోన్ గురించి అధికారిక ప్రకటన మాత్రం రాలేదు. ఈ వారంలో ఎప్పుడైనా రిలీజ్ తేదీ గురించి ప్రకటించే అవకాశం ఉంది. ఈ సినిమాకు సంతోష్ శ్రీనివాస్ దర్శకత్వం వహించగా నభా నటేష్ అను ఇమ్మానుయేల్ హీరోయిన్లుగా నటించారు. చూడాలి మరి అల్లుడు అదుర్స్ సంక్రాంతికి ఎలా సందడి చేయనుందో..!!


## నేను ఎక్కడున్నానో చెప్పుకోవాలోచ్ : రకుల్

రకుల్ ప్రీత్ సింగ్ శరీర సౌష్టవాన్ని గమనిస్తే.. ఓ అద్భుతమైన చేతివాటం కలిగిన శిల్పి చెక్కిన శిల్పంలా కనిపిస్తుంది. మిస్ వరల్డ్ మెజర్ మెంట్స్ 34-26-34 స్ట్రక్చర్ తో ఫ్యాన్స్ ను మెస్మరైజ్ చేస్తుంది ఈ భామ. అయితే.. ఇదంతా ఊరికే వచ్చిన షేప్ కాదు. దీనివెనుక ఎంతో శ్రమ అంతకు మించిన పట్టుదల ఉన్నాయి. మార్నింగ్ మార్నింగే జిమ్ లో కసరత్తులు చేసే ఈ అమ్మడు.. ఆ తర్వాత యోగాసన్నాలు వేస్తుంది. ఎట్టి పరిస్థితుల్లోనూ వ్యాయామానికి గ్యాప్ ఇవ్వదు. షూటింగ్ లకు బ్రేక్ ఇచ్చినప్పటికీ.. బాడీ ఎక్సర్ సైజ్ కు మాత్రం బ్రేక్ ఇవ్వదు ఈ బ్యూటీ. ఎక్కడ ఉన్నా.. ఆసనాలు మాత్రం వేసి తీరుతుంది. ఇందుకు సంబంధించిన ఓ లేటెస్ట్ పిక్ ను అభిమానులతో పంచుకుంది రకుల్. అయితే.. గతంలోనూ తన ఫిట్ నెస్



ఫొటోలు యోగా పిక్స్ సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది ఈ బ్యూటీ. కానీ.. ఈ సారి పోస్ట్ చేసిన ఇమేజ్ మాత్రం.. చూసే వారితో 'ఔరా' అనిపిస్తోంది. ఈ లెటెస్ట్ పిక్.. గత చిత్రాలను ఓవర్ టేక్ చేసింది. యెగాసనాల్లో మోస్ట్ పవర్ ఫుల్ 'హలాసనం' వేసి ఆశ్చర్యపరిచింది రకుల్. ఈ ఫొటో చూసిన అందరూ.. రకుల్ ఫ్లెక్సిబుల్ బాడీ పై ప్రశంసలు కురిపిస్తున్నారు. ఈ ఫొటోను పోస్ట్ చేసిన రకుల్.. "నేను ఎక్కడ ఉన్నాను?" అంటూ కోట్ యాడ్ చేసింది. ఇక రకుల్ సినిమాల గురించి చూస్తే.. ప్రస్తుతం బాలీవుడ్ లో హీరో అజయ్ దేవ్ గన్ సరసన 'మేడే' చిత్రంలో నటిస్తోంది. ఆ తర్వాత దర్శకుడు ఇంద్ర కుమార్ "థాంక్ గాడ్" పేరుతో తెరకెక్కిస్తున్న చిత్రంలోనూ నటిస్తోంది. ఇందులో కూడా అజయ్ దేవగన్ హీరోగా నటిస్తున్నారు. ఈ మూవీ షూటింగ్ ఈనెల 21నుంచి మొదలుకానుంది. సిద్ధార్థ్ మల్హోత్రా కూడా నటిస్తున్న ఈ సినిమాను టీ-సిరీస్ భూషణ్ కుమార్ నిర్మిస్తున్నారు.

## నేను చిన్నారిని కాదు.. బికినీలో అవికాగోర్.. మంటలు పుట్టిస్తోందిగా..



'అవికాగోర్..' అనగానే అందరి మనసులో మెదిలేది 'చిన్నారి పెళ్లికూతరే'. మరికాస్త థింక్ చేస్తే.. నిండైన బొద్దుగుమ్మ కనిపిస్తుంది. కానీ.. ఇప్పుడు లేటెస్ట్ గా రిలీజ్ చేసిన తన పిక్ చూస్తే.. యూత్ కి పిచ్చెక్కడం ఖాయం! ఏకంగా.. టూ పీస్ బికినీతో ఈ అమ్మడు ఇచ్చిన ఫోజ్ ను చూసిన వారికి మైండ్ బ్లాంక్ అవుతోంది. బ్లూ కలర్ బికినీలో.. బ్లూయిష్ గా కనిపిస్తున్న నీటి ఒడ్డున పడుకొని అవికా చూపిస్తున్న అందాలు కుర్రకారు మతులు పోగొడుతోంది. 'ఏంటి.. ఈమె ఆమేనా..?' అని నోరెళ్లబెడుతున్నారు చాలా మంది. సిల్వర్ స్క్రీన్ పై.. సిల్వర్ జూబ్లీ సినిమా లెక్క ఆడాలంటే ఒకే పాత్రలో సెట్టైపోతే కుదరదు మరి! హీరోయిన్ గా ఎదగాలనుకుంటే అస్సలే కుదరు. తెరపై అందాలు ఆరబోయాలి.. హీరోతో ఘాటు రొమాన్సులు చేయాలి. అప్పుడే జనాల నోళ్లలో నానుతారు. నాలుగు ఛాన్స్ లు చెంతకొస్తాయి.

సో.. ఇలాంటి క్యారెక్టర్లకు నేను రెడీ అన్నట్టుగా.. లేటెస్ట్ పిక్ రిలీజ్ చేసింది ఈ హెూమ్లీ బ్యూటీ. తెలుగులో ఉయ్యాలా జంపాలా సినిమా చూపిస్త మావా రాజుగారి గది-3 సినిమాల్లో నటించిన అవికా.. ఆ తర్వాత తెరపై కనిపించలేదు. ఈ మూడు చిత్రాల్లోనూ పక్కింటి అమ్మాయిలా సంప్రదాయ బద్ధమైన గెటప్ లో కనిపించింది. ఇలాగే కంటిన్యూ అయితే కెరీర్ కే మోసం వస్తుందని భావించిందో ఏమోకానీ.. ఏకంగా బికినీ వేసి తనలోని మరో యాంగిల్ బయటపెట్టింది. అవికా పోస్ట్ చేసిన ఈ పిక్ సోషల్ మీడియాలో మంటలు పుట్టిస్తోంది. మరి ఇకనైనా ఈ అమ్మడికి అవకాశాలు ఎంతమేర తలుపు తడతాయో చూడాలి.

Printed,Published & Owned by: Sajja Dhananjaya Sarath, Printed at Unyted Publications from H.no.# 5+-61-3,Rajendra Nagar,Seethampeta,Visakhapatnam-16,Published at H.No. 5+-61-3,Rajendra Nagar,Seetham peta, Visakha patnam-16, Andhrapradesh,India. Editor: Sajja Dhananjaya Sarath. RNI:APTEL/2008/25531,Permitted for posting under concession rates of postage, Postal Registration No. VJ/189/2017-19,Email.editor.prajapalana@gmail.com